
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.8

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 21 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	566.70 (248.2946)	67,556	4058
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	866.89	531.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.573 (16.8784)	నిల్	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



నకిలీలపై నిఘా

- వరంగల్ ఆర్‌జేడీ నేతృత్వంలో విచారణకు కమిటీ !
- ఇంటర్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌లో తప్పుడు పత్రాల పరిశీలనకు ఆదేశం
- ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై ఫిర్యాదులు

నకిలీ అధ్యాపకులపై ప్రభుత్వం విచారణ చేపట్టనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తూ 2025 మేలో రెగ్యులరైజ్ అయిన వారి విద్యార్హతలు, పూర్వాపరాలు, వ్యక్తిత్వం, నియామక ఉత్తర్వుల్లోని నిబంధనల పరిశీలనకు ఉపక్రమించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ ఎట్టకేలకు ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

క్రమబద్ధీకరణ పొందిన లెక్చరర్లలో పలువురు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారనే ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో తాజాగా బోర్డు రెగ్యులర్ అయిన అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలనకు కమిటీని ఏర్పాటుచేసింది. నకిలీ సర్టిఫికెట్లపై సమస్త ఆధారాలతో ఉన్నతాధికారులకు, సీబీసీఐడీకి సైతం ఫిర్యాదులు వెళ్లిన విషయం తెలిసిందే. పలుమార్లు ఇంటర్ బోర్డ్ అధికారులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినా అమ్యామ్యాలతో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో...

- మిగతా 7వ పేజీలో...

ప్రాజెక్టుల నిర్వహణేదీ?

కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. వానాకాలం సీజన్‌కు ముందే నిర్వహణాపరమైన మరమ్మతులు చేయాల్సి ఉండగా, వాటిని పట్టించుకోకుండా ప్రమాదాలు ముంచుకొచ్చేంతవరకూ వేచి చూస్తున్నారు. దీంతో ప్రాజెక్టుల పటిష్టత ప్రశ్నార్థకంగా మారుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)/నెట్‌వర్క్)



నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే పై పడిన గుంతలు

- వానాకాలం ముందస్తు పనుల నిర్వహణలో లోపాలు
- అరకొర పనులతో మమ అనిపిస్తున్న వైనం
- స్పిల్‌వే మరమ్మతులపై ముందుకుపడని ప్రతిపాదనలు
- మూసీ, డిండి, శాలిగౌరారం ప్రాజెక్టుల నిర్వహణా అంతంతే

ప్రతి వేసవిలో ప్రాజెక్టుల నిర్వహణ నిమిత్తం గేట్ల మరమ్మతులు, కట్టల బలోపేతం, స్పిల్‌వేలకు అవసరమైన మరమ్మతులు, డ్యామ్‌లపై లైటింగ్‌ఏర్పాట్లు, జంగల్ కటింగ్ వంటి పనులను చేపట్టాల్సిన ఉంది. కొన్ని పనులు తూతూమంత్రంగా చేసి వదిలేస్తుండగా, మరికొన్ని పనులు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేవంటూ చేయకుండా వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలకమైన నాగార్జునసాగర్, డిండి ప్రాజెక్టులతోపాటు, శాలిగౌరారం ప్రాజెక్టుపైనా ఈ అశ్రద్ధ కనిపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాజెక్టుల కనీస నిర్వహణ పనులు చేపట్టాలనే సూచనలు రైతాంగం నుంచి వస్తున్నాయి.

సాగర్ స్పిల్‌వే మరమ్మతులు ఈ ఏడాదికి లేనట్లే

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా విరాజిల్లుతూ రెండు రాష్ట్రాల్లో 22లక్షల ఎకరాలకు సాగు నీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ స్పిల్ వే మరమ్మతులు ఈ ఏడాదికూడా చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి స్పిల్‌వేకు ప్రాజెక్టు నిర్మాణ సమయం (1967లో పూర్తయింది) నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు మరమ్మతులు చేశారు. మొదట 1987లో స్పిల్‌వేకు మరమ్మతులు చేశారు. ఆ తర్వాత 2009లో వచ్చిన భారీ వరదలకు స్పిల్‌వేపై భారీ గుంతలు పడటంతో 2011లో రూ.40 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత 2014లో తిరిగి రూ.16 కోట్ల వ్యయంతో స్పిల్‌వే మరమ్మతులు చేపట్టారు. తాజాగా 2023లో రూ.20 కోట్ల వ్యయంతో స్పిల్‌వే మరమ్మతులు చేశారు. కానీ 2024లో వచ్చిన చిన్నపాటి వరదకే స్పిల్‌వేపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సాగర్ స్పిల్‌వేకు ఆధునిక పరిజ్ఞానంతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని అలాగే స్పిల్‌వే వద్ద అటు ఇటు కదిలే క్రేన్‌ను ఏర్పాటు చేస్తే స్పిల్‌వే మరమ్మతులు చేపట్టడం సులభం అవుతుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఈ ఏడాది జనవరి నెలలో హైదరాబాద్‌లో జలసౌధలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపారు. కానీ నేటివరకు ఆ పనులు ఏవి మొదలు కాలేదు. తాజాగా గత నెలలో ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధులతో కలిసి సాగర్ స్పిల్‌వేను పరిశీలించి వెళ్లింది. స్పిల్‌వేపై పడిన గుంతలను ఆధునిక పరిజ్ఞానంతో పూడ్చివేయాలని, ఇందుకు సంబంధిచిన నివేదికలు ఈఎన్‌సీకి...

- మిగతా 8వ పేజీలో...

డిండి ప్రాజెక్టు నిర్వహణపై చిన్నచూపు

నల్లగొండ జిల్లాలో నిజాం హయాంలో నిర్మించిన ప్రాచీన ప్రాజెక్టు డిండి ప్రాజెక్టు. 2.4టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్వహణపై ఇరిగేషన్‌శాఖ శీతకన్నేసింది. ఈ ప్రాజెక్ట్ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు షట్టర్లుండగా, మధ్య షటర్‌నుంచి నిరంతరాయంగా నీరు లీకేజీ అవుతుంది. షటర్ గ్రూ సరిగా కూర్చోకపోవడంతో రబ్బరు సీలు నుంచి నీటి లీకేజీ అవుతుంది. నీటి లీకేజీని అదుపు చేసేందుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. స్పిల్‌వే వియర్ ముందు భాగంలో ఉన్న కంపచెట్లను తొలగించలేదు. దీంతో ప్రాజెక్టు ఓవర్ ఫ్లో అయ్యే సమయంలో నీరు సాఫీగా వెళ్లడం లేదు. కనీస నిర్వహణ సైతం ఇరిగేషన్‌శాఖ పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు పటిష్టత దెబ్బతినడంతోపాటు నీటి లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి.



ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సాగునీటి సమస్య పరిష్కరించాలి

కేతేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటిని అందించే డి49, డి50కాల్వలకు సరైన రీతిలో సాగు నీటిని అందించేందుకు ప్రధాన కాల్వకు గేట్లు అమర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇనుపాముల, గుడివాడ, కొర్లపహాడ్, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములకు, చెరువులు, కుంటలకు నీటిని అందించే డి49, డి50 కాల్వలను పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కాల్వలోని షట్టర్‌కు గేట్లు లేకపోవడంతో డి49, డి50కాల్వలకు తగినంత నీరు రావడంలేదన్నారు. దీంతో ప్రతి ఏటా మండలంలోని ఆయకట్టుతో పాటు చెరువులు, కుంటలు నిండని పరిస్థితి నెలకుంటుందని అన్నారు. అధికారులు స్పందించి ప్రధాన కాల్వలకు గేట్లు అమర్చి డి49, డి50 కాల్వలకు నిర్దేత మోతాదులో నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ. అనితాగౌడ్, వి. నాగయ్య, పద్మ, పి. రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికలెప్పుడో?

- పట్టణాల్లో మొదలైన చర్చ
- వార్డుల విభజన లేనట్లేనా..



స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైన నేపథ్యంలో మునిసిపల్ పోరుపై పట్టణాల్లో చర్చ మొదలైంది. ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలోని 128 మునిసిపాలిటీల్లో పాలక మండళ్ల గడువు ముగిసింది. ఆయా మునిసిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే పాలక వర్గ పాలన ముగిసి ఆరు నెలలు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని, ఎప్పటిలోగా నిర్వహిస్తారో? చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

పాలకవర్గం లేకపోవడంతో పట్టణాల్లో పాలన కుంటుపడిందని చెప్పకతప్పదు. అభివృద్ధి పనులు జరగకపోవడం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో పౌరసేవల్లో జాప్యం నెలకొంటోంది. మునిసిపాలిటీల్లో పారిశుధ్య వ్యవస్థ మరీ అధ్వానంగా మారగా, 100 రోజుల యాక్షన్ ప్లాన్ నామమాత్రంగా సాగుతుందనే ఆరోపణలున్నాయి.

వార్డుల విభజన ఉంటుందా..?

పట్టణీకరణ జరుగుతుండటంతో మునిసిపాలిటీల్లో వార్డుల విభజన ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జిల్లాలో 8, యాదాద్రి భువనగిరి జిల్లాలో 6, సూర్యాపేట జిల్లాలో 5తో కలిపి 19 మునిసిపాలిటీలుండగా వార్డుల సంఖ్య 416గా ఉంది. అయితే నూతనంగా ఏర్పడిన..

- మిగతా 8వ పేజీలో...

ఎలాంటి సమాచారం అందలేదు



పట్టణాల్లో రోజురోజుకు జనాభా పెరుగుతున్న మాట వాస్తవమే. అయితే వార్డుల పునర్విభజన, పట్టణాల విస్తరణ అనేది అతిపెద్ద అంశం. ఆయా అంశాలకు సంబంధించి ప్రభుత్వానిదే తుది నిర్ణయం. మునిసిపల్ ఎన్నిక నిర్వహణ, వార్డుల విభజన తదితర అంశాలపై మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎలాంటి సమాచారం అందలేదు.

- గుణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

ఈ నెల 20 వరకు వర్షపాతం లోటు ఉన్న మండలాలు ఇవే..

మండలం	వర్షపాతం లోటు (మి.మీలలో)
చిట్యాల	13.6
నార్కట్‌పల్లి	32.4
కట్టంగూరు	42.4
శాలిగౌరారం	37.1
నకిరేకల్	20.3
కేతేపల్లి	48.3
తిప్పర్తి	38.1
నల్లగొండ	45.1
కనగల్	34.4
అనుముల	51.6
నిడమనూర్	45.6
త్రిపురారం	39.0
మాడ్గులపల్లి	49.5
వేములపల్లి	49.5
మిర్యాలగూడ	45.2
దామరచర్ల	23.3
అడవిదేవులపల్లి	42.5
తిరుమలగిరిసాగర్	35.0
పెద్దవూర	32.9
గుర్రంపోడు	53.1
పీఏపల్లి	21.3
నేరడుగొమ్ము	22.2
కొండమల్లేపల్లి	11.8
దేవరకొండ	10.5
చందంపేట	8.6
గుడిపల్లి	31.0
మునుగోడు	2.3
చండూరు	34.4
గట్టుప్పల్	16.2
నాంపల్లి	57.6



వర్షపాతం లోటు.. మెట్టకు చేటు

- వానాకాలం ప్రారంభమై 50 రోజులు గడిచినా సమృద్ధిగా కురవని వానలు
- అక్కడక్కడ చిరుజల్లుల నుంచి మోస్తరు వానలతోనే సరి
- మెట్ట పంటలపై తీవ్ర ప్రభావం

నల్లగొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై 50రోజులు గడుస్తున్నా జిల్లాలో సమృద్ధిగా వర్షా లు కురవకపోవడంతో రైతాంగం తీవ్రఆందోళన వ్యక్తం చేస్తుంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వర్షాలకోసం ఎదురు చూస్తున్నారు. అక్కడక్కడ చిరుజల్లుల నుంచి మోస్తరు వాన లే కురుస్తున్నాయి తప్ప భారీ వర్షాలు రావడంలేదు. జూన్, జూలైలో పెద్దఎత్తున వర్షాలు కురుస్తాయని భావించినప్పటి కీ ఆశించినస్థాయిలో వానలు పడటంలేదు. వరుణుడు దాగు డుమూతలు ఆడటం తప్ప వానాకాలంలో.. ఎండాకాలం మాదిరి పరిస్థితులు తారుమారయ్యాయి. ఈ ఏడాది రుతుపవనాలు నిర్దిష్ట సమయం కంటే ముందే.. అంటే మే నెలాఖరులోనే రాష్ట్రంలోకి ప్రవేశించినా, ఆ తర్వాత రానురాను జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు పడటంలేదు. జూలైలో కూడా రుతుపవనాల్లో ఎలాంటి కదలికలు లేకపోవడంతో చినుకు కురువని పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు కురవకపోవడంతో భూమిలో తేమశాతం లేక వాతావరణ చల్లబడటంలేదు. నల్లగొండ జిల్లాలోని 33 మండలాలను పరిశీలిస్తే దేవరకొండ డివిజన్‌లో -50.7మిమీల వర్షపాతం లోటు ఉంది. అదేవిధంగా నల్లగొండ డివిజన్‌లో -35.1మి.మీల లోటు మిర్యాలగూడ డివిజన్‌లో -41.7మి.మీల వర్షపాతం లోటు, చండూరు డివిజన్‌లో -11.3మి.మీల వర్షపాతం లోటు ఉంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా సగటున వర్షపాతం లోటును పరిశీలిస్తే ఆదివారం నాటికి -26.4శాతం వర్షపాతం లోటు రికార్డు అయింది. జిల్లాలో ఎక్కడా వర్షపాతం చెప్పదగ్గట్లుగా నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలంలో సైతం ఎండకాలం మాదిరిగానే పరిస్థితులున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగడం ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉన్నట్లు ఉక్కపోత ఉంటుంది.

వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే..

సమృద్ధిగా వర్షాలు కురిస్తే తప్ప వాతావరణంలో మార్పులు కనిపించే అవకాశాలు కానరావడం లేదు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన ఇప్పటికి సాధారణ వర్షాపాతాలు నమోదు కాలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. అప్పుడప్పుడు మబ్బులు కనిపించడం తప్ప వర్షాలు మాత్రం కురవడంలేదు. జిల్లాలో ఏదో ఒక చోట, ఎప్పుడో ఒక రోజు కొద్దిసేపు స్వల్పంగా వర్షం కురవడం మినహా వ్యవసాయానికి అనుకూలంగా వర్షం పడటంలేదు. మే నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసినా రైతులు అవి మొలకెత్తకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. మేనెలలో కురిసిన అడదడపా కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకొని సిద్ధంగా ఉన్నా రైతులకు నైరుతి రుతుపవనాలు ఊరించి ఉసురుమన్పించాయి. అయితే జూన్ నెలలో వర్షాలు పడకపోవడంతో జూలై మొదటి వారంలో అడపదడపా కురిసిన వర్షాలతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. ప్రస్తుతం అంటే గత రెండు రోజులుగా ఆడపదడపా కురుస్తున్న వర్షాలు ఆశాజనకం లేవని చెప్పవచ్చు.

మూడు మండలాల్లో మినహా అంతటా అరకొర వానలే...

జిల్లాలోని 33 మండలాలు పరిశీలిస్తే చండూరు డివిజన్ లోని మర్రిగూడలో 66.3మి.మీలు, గుండ్లపల్లిలో...

- మిగతా 8వ పేజీలో...

పుష్పాంబరి దేవిగా ఎల్లమ్మ

కనగల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆషాడ మాసం చివరి ఆదివారం అమ్మవారు పుష్పాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించారు. చీర సారె ఒడిబియ్యం బోననైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అర్చకులు అమ్మవారికి విశేషంగా అలంకరించి హారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

పండుగలు మన సంస్కృతికి ప్రతీకలు

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



సాగర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నాగార్జునసాగర్, జూలై20(ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీ ముత్యాలమ్మ, పైలాన్ కాలనీ పోచమ్మ ఆలయాల్లో ఆదివారం ని ర్వహించిన బోనాల పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ప్రసాద్,రాంబాబు, నాగరాజు, రంగారెడ్డి, భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాలు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో కొలువైన మహిషాసురమర్ధిని, ఆంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు మహిళలకు ఆదివారం బోనాలు సమర్పించారు. మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవార్లకు బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకొని తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ ప్రధాన అర్చకుడు వెల్లటూరి రామ్మోహన్‌శర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిట్యాలలో 7.5సెంటీమీటర్ల వర్షం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కురియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా, లైట్ల వెలుతురులో ప్రయాణించాయి. చిట్యాలలో 7.5, నార్కట్‌పల్లిలో 6, కట్టంగూరులో 5.7, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 5.8, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది.



చిట్యాలలో కురుస్తున్న వాన

క్రిటికల్ కేర్.. అయినా డోంట్‌కేర్



నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి క్రిటికల్ కేర్ సమీపంలో వ్యర్థ పదార్థాలను ఇష్టానుసారం పారబోస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతుండడంతో రోగులు, ఇబ్బందులు పడుతున్నారు. అక్కడున్న వ్యర్థాలను పశువులు వచ్చి తింటున్నాయి. ● ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలగిరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి బ్రిడ్జికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన మెటల్ క్రాస్‌ను ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని చిన్న పడిశాల గ్రామానికి చెందిన అంబటి రాములు(క్రిష్ణ)(37) ద్విచక్రవాహనంపై జనగామ రోడ్డు నుంచి తిరుమలగిరికి వస్తుండగా మునిసిపల్ కేంద్రంలోని గురుకుల పాఠశాల సమీపంలో బ్రిడ్జి రోడ్డు అనుసందానంగా ఏర్పాటు చేసిన మెటల్ క్రాస్‌ను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. రాములు తల్లి సవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ చింతపల్లి మండలంలోని నసర్లపల్లి హైవేపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రహదారిపై ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి బాధ్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇతర రాష్ట్రాల కార్మికులపై విచారణ

నేరేడుగొమ్ము, జూలై 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ కృష్ణా పరివాహక ప్రాంతంలో చేపలు పట్టడానికి వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చారు. వారితో అధిక పని చేయిస్తున్నారని నేరేడుగొమ్ము పోలీసులకు సమాచారం అందింది. నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్పీ మౌనిక, సీఐ బీసన్న వైజాగ్‌కాలనీకి చేరుకున్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో చేపలు పడుతూ పని ఒత్తిడికి గురవుతున్న 20మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు బాలకార్మికుడు ఉన్నట్లు గుర్తించి విచారణ చేస్తున్నారు. వారందరినీ దేవరకొండకు తరలించి టీటీడీ కల్యాణ మండపంలో ఆశ్రమం కల్పించారు. వారు ఏ రాష్ట్రాలకు చెందినవారు?, ఎవరు తీసుకువచ్చారు?, ఎన్ని గంటలు పనిచేయిస్తున్నారన్న విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కార్మికులు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌ఘడ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారిగా అనుమానిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయాలు

చండూరు రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): చాటిచెట్టు పైనుంచి జారి కిందపడిన గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని ఉడుతలపల్లి గ్రామ ఆవాస గ్రామం దుబ్బగూడెంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సిలుముల కృష్ణయ్య(45) గ్రామంలో గీత కార్మికుడిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం రోజు మాదిరిగానే గ్రామానికి సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే 108లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పట్టుదలతో విజయాలు సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివి విజయం సాధించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి గణిత పోటీల్లో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన నల్లగొండకు చెందిన విద్యార్థులను ఆదివారం జిల్లాకేంద్రంలోని నల్లగొండ ఇనిస్టిట్యూట్ అభినందించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు గణిత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. చిన్నారుల్లో మానసిక గణిత నైపుణ్యాల మెరుగుదల కోసం అబాకస్ ఉపయోగపడుతుందన్నారు. విద్యారంగంలో కీలక మార్పులు వస్తున్న నేపథ్యంలో టెక్నాలజీతో చిన్నప్పటి నుంచి గణితంపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ బ్రాంచ్ హెడ్ భవాని, పల్లా దేవేందర్‌రెడ్డి, స్పందన, నవనీత, ఎస్. మనుశ్రీ, విన్మయి, రీయాన్సిక, అభిజ్ఞ, దినేష్ కార్తీక్, దుర్గ వర్మ, రిషిధర్ షణ్ముఖ ప్రియా, కృతిక, నిద్విత్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 20(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు, రాజధాని (హైదరాబాద్) నగరంలో బోనాల పండుగ ఉన్నా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు వాహనాలపై తరలివచ్చారు. 26వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఉదయం 9నుంచి 10గంటలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.31,64,411 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. యాదగిరికొండపై హరిహరులకు నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్ కుటుంబ సమేతంగా లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. కొండపైన ప్రతీవారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా మణి భార్గవి బృందం (కూచిపూడి, కృష్ణాజిల్లా) కూచిపూడి, సంకల్ప్ నృత్యవృక్ష (హైదరాబాద్) ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.



ఆలయ కళాతోరణంలో కళాకారుల నృత్య ప్రదర్శన

మీసేవ.. చేరువగా

- ఇప్పటికే 400 రకాల సేవలు పొందుతున్న ప్రజలు
- అందుబాటులోకి కొత్తగా 12రకాల సేవలు
- మ్యారేజీ సర్టిఫికెట్లు సైతం అక్కడే
- ఉమ్మడి జిల్లాలో 303 మీ సేవ కేంద్రాలు



మిర్యాలగూడలోని మీ-సేవ కేంద్రం

ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా పారదర్శకంగా, వేగంగా ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలా మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పలురకాల ప్రయోజనాలు అందిస్తున్న మీ సేవ ప్రజలకు మరింత చేరువవుతోంది. ఇప్పటికే సుమారు 400 రకాల సేవలు ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతుండగా, కొత్తగా మరో 12 సేవలు అందుబాటులోకి వచ్చాయి.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ప్రస్తుతం రెవెన్యూ, మునిసిపాలిటీ, పంచాయతీరాజ్ సేవలు అందిస్తుండగా, తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ జారీ చేసే వివాహ ధ్రువీకరణ పత్రం, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు పొందే అవకాశం కల్పించింది. వీటి కోసం స్లాట్‌బుకింగ్ సౌకర్యం కల్పించింది. 5వేల జనాభాకు ఒక కేంద్రం చొప్పున ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు 2011లో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ప్రారంభించింది. ప్రారంభంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడం లాంటి సేవలు కొనసాగాయి. సేవలను క్రమేపి విస్తరిస్తూ ప్రస్తుతం 400 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో పాటు సవరించిన నిబంధనల ప్రకారం అర్బన్ ప్రాంతాల్లో 10వేలు, గ్రామీణ ప్రాంతాల్లో 8వేల జనాభాకు ఒక మీ సేవ కేంద్రం సేవలు అందించేందుకు నిర్ణయించారు. నల్లగొండ జిల్లాలో 137, సూర్యాపేటలో 90, యాదాద్రి భువనగిరిలో 76 కలిపి ఉమ్మడి జిల్లాలో 303 మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా మరో 12రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. మైనార్టీ సర్టిఫికెట్స్, రేషన్‌కార్డుల దరఖాస్తు, ఎడ్యుకేషన్ గ్యాప్ సర్టిఫికెట్, మ్యారేజీ సర్టిఫికెట్, ల్యాండ్ మార్కెట్ విలువ, ఆర్టీఏ, పాన్‌కార్డు, తదితర సేవలు అందుబాటులోకి తేగా త్వరలో టీ-ఫైబర్, ఇసుక బుకింగ్ అందుబాటులోకి తెచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.

మీ-సేవను సద్వినియోగం చేసుకోవాలి



మీ-సేవ ద్వారా మరింత సులభంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నూతనంగా మ్యారేజీ సర్టిఫికెట్, వ్యవసాయేతర భూముల విలువ పత్రాలతో పాటు 12రకాల సేవలను పొందే అవకాశం కల్పించింది. త్వరలో ఇసుక బుకింగ్, టీ-ఫైబర్ సేవలు అందించడానికి కృషి చేస్తోంది. ప్రజలు నూతనసేవలు సద్వినియోగం చేసుకోవాలి.

- దుర్గారావు, ఈ-జిల్లా మేనేజర్, నల్లగొండ.

మార్కెట్ విలువ సర్టిఫికెట్

గృహ నిర్మాణాలు ఇతర బ్యాంకు రుణాల కోసం వ్యవసాయేతర భూములకు మార్కెట్ విలువ ధ్రువీకరణపత్రాలు అవసరమవుతాయి. గతంలో రిజిస్ట్రేషన్ శాఖలో వీటిని మ్యాన్యువల్‌గా ఇచేవారు. ప్రస్తుతం వాటిని మీ సేవ ద్వారా అందించనున్నారు.

మ్యారేజీ సర్టిఫికెట్ కోసం..

గతంలోపెద్దలు కుదిర్చి బంధువులు, స్నేహితుల సమక్షంలో వివాహం చేసుకున్న దంపతులు మ్యారేజీ సర్టిఫికెట్లకు విలువ ఇవ్వలేదు. పెద్దల మాటే నలుగురిలో చెలామణి అయింది. ప్రస్తుతం ప్రేమ పెళ్లిలకు, పెద్దలు కుదిర్చిన పెళ్లికి సైతం దంపతులు వివాహ ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. విదేశాలకు వెళ్లేవారికి ఇది తప్పనిసరిగా మారింది. మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరగలేక ఏజెంట్లను ఆశ్రయించాల్సి వచ్చేంది. ప్రస్తుతం ఆ ప్రయాస లేకుండా మ్యారేజీ సర్టిఫికెట్ జారీకి మీ సేవలో స్లాట్ బుకింగ్ విధానం అమలుచేస్తున్నారు. దరఖాస్తుదారులు, పెళ్లి ఫొటోలు, చిరునామా, ఆధార్, ఓటర్ ఐడీకార్డు, వయసు ధ్రువీకరణ కోసం పదో తరగతి మెమో, ఇరు కుటుంబాల పెళ్లి కార్డులు, ముగ్గురు సాక్షుల గుర్తింపుకార్డులు అవసరమవుతాయి.

డ్రైవింగ్ సీటులోనే గంటన్నర విలవిల

● లారీని వెనుకనుంచి ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ● నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం ● నార్కట్‌పల్లి మండలంలో ఘటన

నార్కట్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో డ్రైవింగ్ సీటులోనే డ్రైవర్ గంటపాటు విలవిలలాడారు. ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ సంఘటన జరిగింది. నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న సిమెంట్ లారీ ఎల్లారెడ్డిగూడెం ఫ్లైఓవర్ పైకి చేరుకునేసరికే ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండానే డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుకనుంచి వస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ స్టార్‌లైనర్ బస్సు అదుపుతప్పి బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతిని నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యం సీటులోనే ఇరుక్కుపోయి గంటసేపు విలవిలలాడాడు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వెళ్లి బస్సులో ఇరుక్కున్న డ్రైవర్‌ను అతికష్టం మీద క్రేన్ సాయంతో బయటకు తీసి పోలీస్ వాహనంలోనే నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. బస్సులో మొత్తం 50మంది ప్రయాణిస్తుండగా సుమారు 10మందికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు రాలేదన్నారు.

గంటన్నర పాటు నిలిచిన ట్రాఫిక్

ప్రమాదంతో ఎల్లారెడ్డిగూడెం వద్ద సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోగా, వన్‌వేతో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. డ్రైవింగ్ సీటులో ఇరుక్కుపోయిన బస్సు డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసే క్రమంలో గంటన్నర సమయం పట్టిందని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో అంబులెన్స్ కూడా ఘటనా స్థలికి చేరుకోలేకపోవడంతో పోలీస్ పెట్రోలింగ్ వాహనంలోనే డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు.





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు, క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

బనకచర్ల జల దోపిడీని అడ్డుకోవాలి



నల్లగొండ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల జల దోపిడీని అడ్డుకోవాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసమన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేశారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులు తీసుకొస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి గాదె శివకుమార్, నాయకులు నోముల శంకర్‌యాదవ్, వంటల చేతన్, సింగరి శివకుమార్, రాజు యాదవ్, స్వప్న, స్వాతి, రాధిక, దివ్య, సంధ్య పాల్గొన్నారు.

పర్యావరణ సాహిత్యంలో ప్రతిభ



నల్లగొండ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సాహిత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిడిమెట్ల రవీందర్‌ను అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా సాహిత్య మేళా నిర్వహించారు. రవీందర్‌ను తెలంగాణ రైటర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు సన్మానించారు.



అడవిదేవులపల్లిలోని ఆలయంలో బోనాలతో మహిళలు

బోనమెత్తిన పల్లెలు

పల్లెల్లో బోనాల సందడి నెలకొంది. గ్రామ దేవతలైన పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ తల్లులకు బోనాలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కోరికలు నెరవేరాలని మొక్కులు చెల్లించుకున్నారు.



బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో బోనాలతో మహిళలు



నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో బోనాలు ఎత్తుకున్న మహిళలు

నిర్మించారు.. వదిలేశారు!

● రూ.7కోట్లు వెచ్చించినా ప్రారంభానికి నోచని నీరా కేంద్రం ● తుప్పు పడుతున్న యంత్రాలు



భువనగిరి మండలం నందనంలో నీరా ప్రాసెసింగ్ యూనిట్ భవనం

భువనగిరి రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఆర్థికంగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో నిర్మించిన నీరా ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి నోచడంలేదు. దీంతో అందులో ఉన్న యంత్రాలు తుప్పు పడుతున్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామ శివారులో మద్య నిషేధ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.7కోట్ల నిధులు విడుదలచేసి 2022 జూలై 29న అప్పటి ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ యూనిట్ ప్రాసెసింగ్‌కు శంకుస్థాపన చేశారు. మూడేళ్లు గడిచినా ఈ నీరా ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి నోచకపోవడంతో గీత కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నీరా ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించి వెం టనే వినియోగంలోకి తెచ్చి గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అసంపూర్తిగాని నిలిచిన ఈ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకవెళ్లినా ఫలితం దక్కలేదు.



ఏర్పాటు చేసిన యంత్రం

కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలి



బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో 2022లో అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ రూ.7కోట్లు వెచ్చించి నీరా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఈ యూనిట్‌ను ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యూనిట్‌లో బిగించిన యంత్రాలు తుప్పు బట్టిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని ఈ యూనిట్ ప్రారంభించి వినియోగంలోకి తేవాలి.

● బోలగాని జయరాములు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు.

మూణ్నాళ్ల ముచ్చటగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో గీత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తాటి ఉత్పత్తి, శిక్షణ కేంద్రాన్ని అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి గాదె వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి 1993 జనవరి18న ఏర్పాటు చేసి ప్రారంభించారు. తాటి కల్లుతో బెల్లం, నీరా ఉత్పత్తి చేయడంతోపాటు తాటి జగ్గలతో విసన కర్రలు, బొమ్మలు తయారుచేసి విక్రయించారు. కాగా అధికారుల నిర్లక్ష్యం, శిక్షణ కేంద్రం నిర్వహణకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో మూడు నెలలకే ఈ కేంద్రం మూతపడింది. అప్పట్లో కూడా గీత కార్మిక సంఘం ప్రతినిధులు ఈ కేంద్రాన్ని పునరుద్ధరించాలని పోరాటాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రూ.7కోట్లు విడుదల చేసి నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్మించినప్పటికీ ప్రారంభించకపోవడంతో గీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల


సాగర్ ఎడమ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

నాగార్జునసాగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వకు ప్రాజెక్టు అధికారులు ఆదివారం ఉదయం నీటి విడుదలను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం పాలేరు జలాశయాన్ని నింపేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పాలేరు జలాశయం నింపేందుకు ఈ నెల 4నుంచి 11వ తేదీ వరకు 1.7 టీఎంసీల నీటిని విడుదల చేశారు. పాలేరు జలాశయం నీటి మట్టం 14అడుగులకు తగ్గడంతో (మొత్తం నీటి మట్టం 24 అడుగులు) తాగు నీటికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో నారు మడులు పోసుకున్న రైతులు మడుల్లో నార్లు ఎండిపోకుండా ఈ నీటిని వాడుకోవచ్చునని అధికారులు తెలిపారు. రోజుకు రెండు వేల క్యూసెక్కుల చొప్పున పాలేరు జలాశయం నిండేవరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 566.70అడుగులుగా(248.2946 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 2,258 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు మొత్తం 4,058 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 67,556 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి కుడి, వరద కాలువలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.

రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

కోదాడ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని సుందరయ్య భవనంలో రెండురోజుల పాటు జరిగే కోదాడ డివిజన్ సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎడమకాల్వపై చిన్న, పెద్ద ఎత్తిపోతల పథకాలు మొత్తం 54 ఉన్నాయని, 80వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే వీటి నిర్వహణను ప్రభుత్వం చేపట్టాల్సిందిపోయి రైతులకు అప్పజెప్పడం సరైంది కాదన్నారు. అనేక సంవత్సరాలుగా ఉన్న యంత్ర పరికరాలు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కాలువలు శిథిలావస్థకు చేరడంతో ఎత్తిపోతల పథకాల రైతులకు భారంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ బాధ్యత, సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించి, ఎత్తిపోతల పథకాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. శిక్షణ తరగతుల ప్రారంభం అనంతరం పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం గురించి నమ్మాది వెంకటేశ్వర్లు బోధించగా, రెండురోజులు జరిగే శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా పట్టణ సీపీఎం కార్యదర్శి ఎం.ముత్యాలు వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముల్కలపల్లి రాములు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం చిలుకూరు, కోదాడ, అనంతగిరి మండలాల కార్యదర్శులు నాగటి రాములు, రూరల్ మండల కార్యదర్శి అల్సగాని బ్రహ్మయ్య, అనంతగిరి మండల కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ, సీపీఎం చిలుకూరు నాయకులు వీణపల్లి వెంకటేశ్వరరావు, పట్టణ కమిటి సభ్యులు నారాయణ, దాసరి శ్రీను, కర్ణకోటి నవీన్, మరియన్న, గద్దపాటి కిరణ్, సాదె కోటేశ్వర రావు, కబీర్‌దాస్ పాల్గొన్నారు.

చిట్యాలలో 7.5సెంటీమీటర్ల వర్షం

నల్లగొండ/మేళ్లచెర్వు/చిట్యాలరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కురియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నెమ్మదిగా, లైట్ల వెలుతురులో ప్రయాణించాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి కొన్ని చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. చింతలపాలెం నుంచి రేవూరు వస్తున్న పల్లెవెలుగు బస్సు రేవురు గ్రామ శివారులో వాగు ప్రవాహం తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిలిపివేశారు. దీంతో 50మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంట తర్వాత వరద ప్రవాహం తగ్గడంతో ప్రయాణం సాగించారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 7.5, నార్కట్‌పల్లిలో 6, కట్టంగూరులో 5.7, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 5.8, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం


రాజాపేట మండలం పాముకుంటలో సాగుచేసిన నేపియర్ రకం పశుగ్రాసం

» పశుగ్రాసాల సాగుపై రైతుల ఆసక్తి
» యాదాద్రి జిల్లాలో 200ఎకరాల్లో సాగు

అడవి జంతువుల బాధ లేదు. కోతులతో నష్టం లేదు.. కూలీల అవసరం అంతకన్నాలేదు. ఎటువంటి నష్టమూ వాటిల్లని పంటలపై రైతులు దృష్టిని సారిస్తున్నారు. కొంత మంది రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభదాయకంగా ఉండే పంటల సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రేనికుంట, పాముకుంట, దూది వెంకటాపూర్, నర్సాపురం, చలూరు గ్రామాల్లో 200 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పశుగ్రాసాల సాగును చేపట్టి లాభాలను ఆర్జిస్తున్నారు. గడ్డి జాతి, పప్పుజాతి రకాల పశుగ్రాసాలను సాగు చేస్తూ అవసరాల మేరకు వినియోగించుకుని మిగతా పశు గ్రాసాన్ని ఇతరులకు విక్రయించి లాభాలను పొందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,రాజాపేట)

రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామానికి చెందిన ఎడ్ల నరేశ్ రెడ్డి, రేణికుంటకు చెందిన బోళ్ల రాఘవరెడ్డి కొంతకాలంగా పశుగ్రాసాలను సాగు చేస్తున్నారు. గతంలో వరి, మొక్కజొన్న ఇతర పంటలను సాగుచేసేవారు. ఆ పంటల సాగులో అడవి జంతువులు, కోతులతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పంటల సాగులో నాట్లకు, కలుపు నివారణకు కూలీలకు అధిక మొత్తంలో డబ్బులను వెచ్చించారు. వీటికి తోడు వాతావరణం అనుకూలించక పోవడంతో ఏటా నష్టాలను చవిచూశారు. వీటన్నింటిని అధిగమిస్తూ ప్రత్యామ్నాయంగా వ్యవసాయ అనుబంధమయిన పశుగ్రాసాల సాగును చేపట్టారు. అందులో భాగంగా నేపియర్ రకాలైన నేపియర్, సూపర్ నేపియర్, బుల్లెట్ నేపియర్, తైవాన్ నేపియర్ రకాలను సాగు చేశారు. ఒక్కో రైతు 20 ఎకరాల వరకు సాగు చేశారు. ఎకరానికి 7 నుంచి 9 వేల పశుగ్రాసం కనుపులను నాటుకున్నారు. విత్తనాన్ని కీసర, షాద్‌నగర్ ప్రాంతాల నుంచి ఒక్క కనుపును 1నుంచి 3 రూపాయలకు కొనుగోలు చేసి తెచ్చుకుని నాటుకున్నారు. ఒక్కసారి నాటితే 5 ఏళ్ల వరకు పనిచేస్తుంది. పదే పదే విత్తనాన్ని మార్చాల్సిన అవసరం లేదు. నాటుకున్న 90 రోజులకు మొదటి కోత మొదలవుతుంది. తిరిగి 45నుంచి 60 రోజలకు రెండో కోత వస్తుంది. ఏడాదిలో 5 నుంచి 6కోతలు వస్తాయి. ఎకరానికి20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తోంది. ఏడాదికి100 నుంచి 120 టన్నుల దిగుబడి వస్తోంది. ముందుగా రైతులు డెయిరీలతో బై బ్యాక్ ఒప్పందాన్ని కుదుర్చుకుని కిలో పశుగ్రాసాన్ని 1రూపాయికి విక్రయిస్తున్నారు. పశుగ్రాసం సాగుకు ఎకరానికి 20 నుంచి 25 వేల రూపాయల వరకు వ్యయం కాగా ఎకరానికి ఏడాదికి ఖర్చులు పోను నికరాదాయంగా 70 వేల రూపాయల ఆదాయాన్ని పొందుతున్నారు.

సాగు ఇలా..



ఎకరానికి 10 టన్నుల పశువుల పేడను, రెండు సంచుల డీఏపీని వేసి కలియ దున్నుకున్నారు. రెండున్నర ఫీట్ల వెడల్పుతో బోదెలుగా చేసుకుని, బోదెలపై మొక్కకు మొక్కకు ఫీటు, ఫీటున్నర దూరం ఉండేలా కనుపులను నాటుకున్నారు. ఎకరానికి 7వేల నుంచి 9 వేల కనుపులను నాటుకున్నారు. నాటిన వెంటనే ఒక్కసారి నీటితడిని అందించారు. రెండుసార్లు కూలీలతో అంతర కలుపు నివారణ చేపట్టారు. మొదటి కోత వరకు 4 నుంచి 6తడులు నీటిని అందించారు. 90 రోజులకు మొదటి కోత రాగా, కోత కోయగానే ఎకరానికి 2 డీఏపీ సంచులు, 1 యూరియా సంచిని పైపాటు ఎరువుగా వేసుకున్నారు.

పశుగ్రాసాలను సాగు చేస్తున్నాం



కోతులు, అటవీ జంతువుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. పంటలు సాగు చేసినప్పుడు తీవ్రంగా నష్టపోయాం. పశుగ్రాసాల సాగులో కూలీల కొరత లేదు. డెయిరీలతో ముందస్తు బై బ్యాక్ ఒప్పందంతో సాగు చేసి విక్రయిస్తున్నాం. మా అవసరాలకు వినియోగించుకుని మిగతాది విక్రయిస్తున్నాం. ప్రభుత్వం పశుగ్రాసాలను సాగుచేసే రైతులను ప్రోత్సహించాలి.

-ఎడ్ల నరేశ్ రెడ్డి, రైతు, పాముకుంట

రైతులకు సబ్సిడీలు కల్పించాలి



పశుగ్రాసాలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలను కల్పించాలి. కరువు పరిస్థితులు ఉన్న ఆలేరు నియోజకవర్గంలో బయోగ్యాస్ ప్లాంట్లను నెలకొల్పాలి. ప్లాంట్లకు అవసరమయ్యే పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహమిస్తే ఉపాధి పెరుగుతుంది. మహా ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని ఇక్కడి రైతులకు అందించాలి. మిషనరీని సబ్సిడీపై అందించినట్లయితే ఎంతో మందికి ఉపాధి కలుగుతుంది.

-బోళ్ల రాఘవరెడ్డి, రైతు, రేణుకుంట

పచ్చిమేత పశువులకు ఎంతో మేలు



పచ్చిమేతను పశువులకు అందించడంతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. దాణా ఖర్చును తగ్గించుకోవచ్చు. పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎదకు త్వరగా వస్తాయి. రైతులు పాడి పశువులకు పచ్చిమేతను ఇవ్వడంతో పాల ఉత్పత్తి పెరుగడంతో పాటు వెన్నశాతం పెరుగుతుంది. రైతులు పశుగ్రాసాలను సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేస్తుంది.

-డాక్టర్ చంద్రారెడ్డి, మండల పశు వైద్యాధికారి, రాజాపేట

యువతరం సాహిత్యంలో రాణించాలి

● సాహితీవేత్త డాక్టర్‌నందిని సిధారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సిధారెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో యువతరం సాహిత్యంలో రాణించాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో సాహిత్య మేళా నిర్వహించారు. ఉదయం యువ కవి సమ్మేళనం, మధ్యాహ్నం వేళ సాహిత్య సదస్సు జరిగింది. తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో కవి, రచయిత, తెలంగాణ సాహితి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ హసేన రాసిన కవితా 'సంపుటి నువ్వే ఒక సమూహం'ను డాక్టర్ నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వర్తమాన పరిస్థితులు - రచయితల స్పందన అనే అంశంపై తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని అధ్యయనం చేయకుండా కవిత్వం రాయడం వల్ల సరైన కవిత్వం రాదని, యువకులు సమాజంలోని అనేక విషయాలపై దృష్టి సారించాలన్నారు. అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని సమాజాన్ని సంస్కరించడానికి తమవంతు కర్తవ్యం నిర్వహించాలని అన్నారు. మరో అంశం శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తక పరిచయంపై కవి రచయిత, మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ మహాప్రస్థానం యువకులకు లాంగ్ మార్చ్ లాంటిదని, కుల మత ఎల్లలు దాటి, శ్రామిక జన సమూహంగా ఉద్యమించినప్పుడే సమ సమాజం వస్తుందన్నారు. అదే శ్రీశ్రీ ఆశయాన్ని అక్షరీకరించి జలపాతం లాంటి ధ్వనితో గేయాలు రాసి ప్రజల చేతికి ఆయుధంగా అందించారన్నారు. ప్రముఖ మట్టి కవి బెల్లి యాదయ్య మాట్లాడుతూ ఈ సభకు ఎక్కువగా యువకులు రావడం వల్ల ఇలా ఎందుకు రాయాలి ఎలా రాయాలి ఈ వస్తువుని ఎలా తీసుకోవాలి అనే దానిపై వివరించారు. డాక్టర్ పగడాల నాగేందర్ మాట్లాడుతూ యవ్వనంలో యువకులు ప్రథమంగా రాసేది ప్రేమ కవిత్వమేనని ఆ తర్వాత అది సామాజిక విలువల వైపు తీసుకెళుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి, బాల సాహితీ వేత్త పుప్పాల కృష్ణమూర్తి, పేరుమాళ్ల ఆనంద్, ఏభూషి నరసింహ, బైరెడ్డి కృష్ణారెడ్డి, యోగా గురువు మాదగాని శంకరయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి , యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఎస్.భీమార్జున్‌రెడ్డి, సృజన సాహితి ప్రధానకార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య, తెలంగాణ సాహితి జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు గోపీకృష్ణ, కార్యదర్శులు పుప్పాల మట్టయ్య, బండారు శంకర్, టి.ఉప్పలయ్య, పగిడిపాటి నరసింహ, గేర నరసింహ, ఆందోజు నాగభూషణం, దాసరి ప్రభాకర్, దాసరి శ్రీరాములు, జీడిమెట్ల రవీందర్ పాల్గొన్నారు. అనంతరం యువకవులను ముఖ్య అతిథులు జ్ఞాపిక, మహాప్రస్థానం పుస్తకాన్ని బహూకరించి సత్కరించారు. అనంతరం సాహితి సదస్సులో ప్రముఖ సామాజిక సేవకులు డాక్టర్ అద్దంకి కృష్ణమాచార్యులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

చెస్‌లో రాణించిన 'తేజ' చిన్నారులు


బహుమతులు అందుకుంటున్న 'తేజ' విద్యార్థులు

కోదాడ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో కోదాడ మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చదరంగం పోటీలు నల్లగొండ జిల్లా చెస్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో నల్గొండలో నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-13 బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి యోగిత, అండర్-9లో 5వ తరగతి విద్యార్థి అద్వైత ప్రథమస్థానాల్లో నిలిచి బహుమతులు గెల్చుకున్నారన్నారు. విజేతలకు నల్గొండ జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ కె.కరుణాకర్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్ యం.విశ్వప్రసాద్‌లు బహుమతులు, ట్రోఫీ అందజేసినట్లు తెలిపారు.

నకిలీలపై నిఘా

(5వ పేజీ తరువాయి)

తాజాగా సర్టిఫికెట్ల పరిశీలనకు కమిటీని నియమించడంతో నకిలీలు వెలుగులోకి వచ్చి చర్యలుంటాయనే ఆశాభావం ఇంటర్ అధ్యాపకుల్లో వెల్లడవుతోంది. శనివారం ఇంటర్‌బోర్డు డైరెక్టర్ విడుదలచేసిన ఉత్తర్వుల ప్రకారం వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ చైర్మన్‌గా నియమించిన ఈ కమిటీలో ఇంటర్‌విద్య అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి, యూనివర్సిటీ నుంచి ఒక అధికారి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సభ్యుడితో పాటు ఇంటర్‌విద్య డిప్యూటీ డైరెక్టర్ శివకుమార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ అన్ని జిల్లాల్లో ఇంటర్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అయిన అధ్యాపకుల సర్టిఫికెట్లను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని తద్వారా నకిలీలు తేలితే చర్యలకు సిఫారసు చేస్తారు.

ఉమ్మడి జిల్లాలోనూ నకిలీ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు

ఇంటర్ అధ్యాపకులుగా రెగ్యులర్ అయిన వారిలో ఉమ్మడి జిల్లాలోనూ కొందరిపై నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారనే ఫిర్యాదులున్నాయి. క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని, వారిని విధుల నుంచి తొలగించడంతోపాటు, చర్యలు తీసుకోవాలని కోరుతూ 2023, డిసెంబర్ 18వ తేదీన తెలంగాణ ప్రభుత్వ విద్యావనరుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి, ఓయూ రీసెర్చ్‌స్కాలర్ వేముల శేఖర్ ఇంటర్ విద్యాశాఖ ఆర్‌జేడీ, కమిషనర్‌తోపాటు ఆయా జిల్లాల ఇంటర్ విద్యాధికారులకు ఫిర్యాదుచేశారు. మొత్తం 11మంది లెక్చరర్లపై ఈ సంస్థ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై అప్పట్లో విచారణకు ఆర్‌జేడీ ఆదేశించగా, ఆయా జిల్లాల డీఐఈవోలు, సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి పారదర్శకత తేల్చే నిమిత్తం సర్టిఫికెట్లు తెప్పించి పరిశీలించి, నివేదికలు ఇచ్చినా చర్యలు మాత్రం కరువయ్యాయి. ఈ లెక్చరర్లపై నమోదయిన కేసు విచారణలో ఉన్నందున వార్షిక ఇంక్రిమెంట్ నిలిపివేయాలని ఆర్‌జేడీ సంబంధిత డీఐఈవోలు, ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులివ్వడంతో వీరికి ఒక ఇంక్రిమెంట్ ఆగిపోయింది. అంతకుమించి చర్యల విషయంలో ముందడుగు పడలేదు. ఈ నకిలీ సర్టిఫికెట్ల విచారణ ముందుకు జరగకుండా, చర్యలు తీసుకోకుండా కమిషనరేట్ స్థాయిలోని ముఖ్య అధికారులే తతంగం నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇంటర్‌బోర్డు అధికారులతోపాటు సీబీసీఐడీ అదనపు డీజీకి కూడా ఈ నకిలీ సర్టిఫికెట్ల అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. వీటన్నింటి నేపథ్యంలో తాజాగా ఈ నకిలీలపై చర్యలకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీ నియమించడంతో ఉమ్మడి జిల్లాలోనూ నకిలీలను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటారనే ఆశాభావం వెల్లడవుతోంది. నకిలీ సర్టిఫికెట్లతో పాటు, రెగ్యులరైజ్ అయిన వారి పూర్వాపరాలు, వ్యక్తిత్వం పైనా ఈకమిటీ పరిశీలన జరపనుండడంతో దురుసుగాప్రవర్తించేవారు, తోటి అధ్యాపకులతో అసభ్యకరంగా ప్రవర్తించేవారిపై వచ్చిన ఫిర్యాదులపైనా ఈ కమిటీ విచారణ జరుపుతుందని భావిస్తున్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం



» వానాకాలం నారుమడికి జాగ్రత్తలు తప్పనిసరి
» నాటుకు సిద్ధం చేయడంలో నైపుణ్యం అవసరం

వానాకాలం సీజన్‌లో సాగు ఊపందుకుంటోంది. బోర్లు, బావుల కింద రైతులు వ్యవసాయం పనులు ప్రారంభించగా, ఆయకట్టు రైతులు సాగర్ కాల్వల నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సాగులో నారుమడి తయారీలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి మునికృష్ణయ్య, ఏఈవో దండెం విజయచంద్ర రైతులకు సూచిస్తున్నారు. నేరుగా వరి విత్తే (వెదజల్లే)విధానాలు కొన్ని ప్రాంతాల్లో ఆచరణలో ఉన్నా చాలా మంది రైతులు నారుమడి పెంచి నాటే పద్ధతిని పాటిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నిడమనూరు)

సాగర్ ఆయకట్టులో రైతులు పొడి దుక్కిలో విత్తనం వెదజల్లుతుండగా, కొందరు నీటి వసతి ఉన్నచోట్ల దమ్ముచేసి నారుమళ్లను పోస్తున్నారు. ఆరోగ్యవంతమైన నారు అంది మంచి దిగుబడులు రావాలంటే నారుమడి దశ నుంచే మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చు. ఆధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించడంతో పాటు విత్తనశుద్ధి చేసి తగిన జాగ్రత్తలతో నారుమడి వేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. కరిగెట్టు సిద్ధం చేసుకోవడంలో కూడా రైతులకు నైపుణ్యం అవసరం. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ప్రధానంగా బీపీటీ, సోనాతో పాటు వివిధ రకాల సన్నరకం విత్తనాలను సాగు చేసుకోవడంతో మంచి దిగుబడులు రావడమే కాకుండా ధాన్యం విక్రయించే విషయంలో కూడా ఇబ్బందులు ఉండవు.

అనువైన సమయం: ఈ నెలాఖరు వరకు స్వల్పకాలిక రకాలు, ప్రత్యామ్నాయ పరిస్థితుల్లో ఆగస్టు మొదటి వారం వరకు అత్యల్పకాలిక రకాల విత్తనాలు నారుమళ్లు పోసుకోవచ్చు.

విత్తన మోతాదు: ఒక ఎకరానికి నాటే పద్ధతులను బట్టి విత్తన మోతాదు అవసరమవుతుంది. దొడ్డు రకాలు 25 కిలోలు, సన్న రకాలైతే 15 నుంచి 20 కిలోల విత్తనాలు ఏర్పాటు చేసుకోవాలి.

నారుమడి తయారీ: పొడి నారుమడి కోసం పొలాన్ని బాగా దుక్కి దున్ని పొడిగా చేసుకుని భూమిలో పదునుగా తేమశాతం ఉండేటట్లుగా చేసుకొని విత్తనం చల్లుకోవాలి. నారుమడిని బాగా దున్ని 2-3 సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీళ్ల పెట్టడానికి, తీయడానికి అనువుగా కాల్వను ఏర్పాటు చేసుకుని ఎత్తు నారుమళ్లను తయారుచేసి నానబెట్టి మండె కట్టిన మొలకెత్తిన విత్తనాలను బెడ్లపై పలుచగా చల్లుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరానికి సరిపడే రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. లభ్యతను బట్టి పశువుల పేడను లేదా వర్మీకంపోస్టు ఎరువులను దుక్కిలో వేయడం మంచిది. ఇందులో నత్రజని ఎరువును విత్తనం చల్లే ముందు ఒక కిలో 10-15 రోజుల తర్వాత నారు పెరిగే దశలో వేయాలి.

నీటి యాజమాన్యం: మొలక కట్టిన విత్తనాన్ని చల్లిన నారుమళ్లలో వారం రోజులు ఆరు తడులు ఇచ్చి, ఆ తర్వాత మొక్కల ఎదుగుదల దశలో పలుచగా 2-3 సె.మీ నీరు పెట్టుకోవాలి.


సూక్ష్మ పోషకాల యాజమాన్యం: నారు చల్లుకున్న 15 రోజుల లోపు జింక్ లోపం కనిపించినట్లయితే నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. మెట్ట నారుమళ్లలో ఇనుపధాతు లోపం కనిపించే అవకాశం ఉంటుంది. లేత చిగురాకులు తెల్లగా మారి, ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆటువంటప్పుడు లీటరు నీటికి 20 గ్రాముల అన్నబేధి, రెండు గ్రాముల నిమ్మఉప్పు రసం కలిపి పిచికారి చేయాలి.

కలుపు యాజమాన్యం: నారుమడిలో 8-10 రోజుల్లో చిన్న చిన్న కలుపు మొక్కలు కనిపించే అవకాశం ఉంటుంది. సాధారణంగా నారుమడిలో అన్ని రకాల కలుపు మొక్కల నివారణకు లీటరు నీటికి 0.5 మిల్లీ లీటర్ల బిస్‌పైరిబాక్ సోడియం కలుపు మందును కలిపి పిచికారి చేయాలి. ఒకవేళ నారుమళ్లలో ఊద, తుంగ, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు కనిపించినట్లయితే 10-15 రోజుల వ్యవధిలో లీటరు ఈటికి 1.5మి.లీ సైహలోఫాస్-పి కలుపు మందును పిచికారి చేయాలి.

చీడపీడల నివారణ ఇలా..

నారుమడిలో మొగి పురుగుకు సంబంధించిన గుడ్లు గమనించినట్లయితే 15-20 రోజుల మధ్యలో లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారి చేయాలి. నారు తీసే ముందు ఎకరం నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి నీరు పలుచగా ఉంచి మడిలో ఇంకేటట్లు చేసుకోవాలి. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలను తుంచి నాటుకోవాలి. దీంతో ప్రధాన పొలంలో మొగి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు.

విత్తనశుద్ధి ఇలా..: నారుమడి తయారీలో విత్తనశుద్ధి ఎంతో ప్రధానం. విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చు. మెట్ట నారుమడులైతే కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజంను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమడి అయితే లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజం కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నీటిలో నానబెట్టి తర్వాత మండె కట్టి మొలకెత్తిన విత్తనాలను పలుచగా చల్లుకోవాలి. సేంద్రియ పద్ధతిలో విత్తనశుద్ధికోసం కిలో విత్తనానికి 8-10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనశుద్ధి చేసుకోవడంతో విత్తనం ద్వారా గాని భూమి నుంచి గాని విత్తనానికి తొలిదశలో సంక్రమించే శిలీంద్ర తెగుళ్ల కారకాల ద్వారా ముఖ్యంగా ప్రధాన పంటలో ఆశించే అగ్గితెగులు, పొట్టకుల్లు తెగులు, కాండం కుళ్లు వంటి తెగుళ్ల రాకుండా పంటను కాపాడుతుంది.



పురాతన ఆలయాల ప్రాచుర్యాన్ని కాపాడుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పురాతన ఆలయాల ప్రాచుర్యాన్ని కాపాడుకోవాలని రవికుమార్‌ఆచార్యులు కోరారు. వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని రామాలయంలో శ్రీవేంకటాచల మహత్యం, బ్రహ్మోత్సవ వైభవంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో గడపాలన్నారు. పురాతన ఆలయాల చరిత్రను నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించని వారికి మోక్ష మార్గం లభించదన్నారు. ఈ కార్యక్రమలో కొత్తా కళావతి, భారతమ్మ, పద్మావతి, సుజాత, పద్మ, రంగాచారి, రామ్మోహన్‌రావు, శ్రీనివాసు, కళావతి, ఇందిర, జయప్రద, లక్ష్మీ, కుమారి, నర్సింహారావు, రంగారావు, కృష్ణవేణి, అరుణ పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ముందుకు సాగుదాం

నార్కట్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులైన పోరాట యోధుల ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదామని సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర నాయకుడు బొమ్మకంటి కొమురయ్య పిలుపునిచ్చారు. 2000ల సంవత్సరంలో వరంగల్ జిల్లా సరసనపల్లిలో ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన దళ కమాండర్ పజ్జూరి కృష్ణారెడ్డితో పాటు భరత్, రాజు వర్ధంతి సందర్భంగా వారి స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బలవంతులు చేసే దోపిడీ, పీడనల అసమానతలు రూపుమాపబడాలని జీవితాంతం పోరాటం చేశారని కొనియాడారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశంగా మార్చుతామని ప్రధాని మోదీ, అమిత్ షాలు కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పల్స యాదన్న, గొల్లాల సైదులు, బంటు రామలింగయ్య, యానాల లింగారెడ్డి, రామకృష్ణ, పల్లెబోయిన జాని, బెల్లి నాగరాజు, పజ్జూరి ఉపేంద్ర, రంజిత్, నారాయణ, శ్రీనివాస్, విష్ణు, చిత్తరంజన్‌దాస్, వినోద్, వెంకటయ్య, నరేశ్, రాజు, బుచ్చయ్య, సైదలు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జనశక్తి నాయకులు

రోడ్డు పనులకు మోక్షమెప్పుడో?

● నార్కట్‌పల్లిలో పునః ప్రారంభం కాని రహదారి విస్తరణ పనులు ● ఈ నెల 6వ తేదీనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చి ఆర్‌అండ్‌బీ ఈఈ

నార్కట్‌పల్లిలో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులకు ముహూర్తం కుదరడం లేదు. ఈనెల 3వ తేదీన నార్కట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే వేముల వీరేశం స్వయంగా ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫోన్ చేసి ప్రశ్నించారు. దీంతో ఈనెల 6వ తేదీన ప్రారంభిస్తామని ఈఈ హామీ ఇచ్చారు. కానీ దాదాపుగా 15 రోజులు దాటినా రోడ్డు పనులకు మోక్షం ఎప్పుడూ లభిస్తోందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



నార్కట్‌పల్లిలో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

నార్కట్‌పల్లి పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్డువిస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ నిధులు సుమారు రూ.16కోట్ల అంచనా వ్యయంతో గతబీఆర్ఎస్ హయాంలో ప్రారంభించారు.లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనం నుంచి సన్‌షైన్ కాలనీ వరకు గల రోడ్డును వెడల్పుచేసి రోడ్డు ఎర్త్ లెవెల్ వరకు డివైడర్‌ను నిర్మించారు. పట్టణ పరిధిలోని వివాదరహిత ప్రదేశాల్లో డ్రైనేజీ నిర్మాణం కూడా పూర్తిచేశారు. ఈ లోగా అసెంబ్లీ ఎన్నికలు రాగా స్తంభించిన పనులు తిరిగి 18 నెలలు గడిచినా తిరిగి కొనసాగించలేదు. అయితే ఆర్‌పీసీఎల్ అటు సన్‌షైన్ కాలనీ నుంచి కామినేని ఫ్లైఓవర్ రోడ్డుచ మిగిలిన రోడ్డు విస్తరణకు కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.6.6కోట్లను మంజూరు చేసింది.

విద్యుత్ శాఖ అంచనా సవరణతోనే జాప్యం ?

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరగడానికి విద్యుత్ శాఖ అంచనా సవరించడమే కొంత కారణమని కూడా తెలుస్తుంది. రోడ్డు విస్తరణ కోసం రెండున్నరేళ్ల కిందట వేసిన విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల అంచనాలో రేపటి అవసరాలను పరిగణలోకి తీసుకోలేదు. దీంతో అంచనా వేయడంలో కొన్నిలోపాలున్నట్లు ఆలస్యంగా గుర్తించారు. రోడ్డు విస్తరణ కోసం మొత్తం ఇరువైపులా కలిసి సుమారు 5.1 కి.మీల వరకు కొత్త విద్యుత్ లైన్ కోసం అప్పట్లో రూ.55.27లక్షలుగా అంచనా వేశారు. కానీ భవిష్యత్ అవసరాలకు అనుగుణం గా పెరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్, పోల్స్ సామాగ్రి కలుపుకుని తాజాగా రూ.90 లక్షలకు అంచనా పెరిగింది. ఈ అంచనా ప్రతిపాదనలను ఆమోదం కోసం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు.

ఆర్‌అండ్‌బీ కూడా సవరించాల్సిందే..

కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుకై రెండున్నరేళ్ల క్రితం వేసిన అంచనాతోనే రోడ్డు విస్తరణ పనుల ఖర్చు మొత్తాన్ని అంచనా నిర్ధారించి రూ.16 కోట్లు మంజూరు చేశారు. ఐతే సవరించిన విద్యుత్ అంచనా మొత్తాన్ని కూడా రోడ్డు విస్తరణ అంచ నా ప్రతిపాదనల్లో చేర్చి ఆమోదం పొందాల్సి ఉన్నట్లు తెలిసింది. ఆ ప్రక్రియ కూడా కొనసాగుతున్నట్లు సమాచారం.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

నార్కట్‌పల్లిలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులను ఈనెల 6వ తేదీన నుంచి మళ్లీ కొనసాగిస్తామని చెప్పిన మాట వాస్తవమే. కానీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా వేసే విద్యుత్ లైన్ల అంచనా సవరణతో జాప్యం జరిగింది. సవరించిన అంచనాలకు ఆమోదం వచ్చే వరకు మిగిలిన రోడ్డు పనులు, డివైడర్ పనులు చేట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

- అజయ్, ఏఈఈ ఆర్‌అండ్ బీ

పనులు ప్రారంభించకుంటే ఆందోళన



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తాం. రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా నిలిచిపోవడంతో పడుతున్న ఇబ్బందులను పేర్కొంటూ ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చాం. ఈనెల 6వ తేదీనే పనులు ప్రారంభింపజేస్తామని మాకుఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

- మేడబోయిన శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఆంజనేయస్వామి ఆలయంలో జగదీ‌ష్‌రెడ్డి పూజలు



జగదీ‌ష్‌రెడ్డిని సన్మానిస్తున్న పూజారి

చిట్యాలరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడు శివారులో గల ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదివారం పూజలు చేశారు. పూజారి వల్లూరి నిఖిల్‌శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందదర్భంగా జగదీ‌ష్‌రెడ్డికి పురోహితుడు శాలువాతో సన్మానం చేశారు. జగదీ‌ష్‌రెడ్డి వెంట తండ్రి రామచంద్రారెడ్డి, కుమారుడు వేమన్‌రెడ్డి ఉన్నారు.

వర్షాలు కురవాలని వనవాసం



వనవాసం వెళ్తున్న గ్రామస్థులు

శాలిగౌరారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వానదేవుడు కరుణించి వర్షాలు కుర వాలని మండలంలోని తక్కళ్ల పహాడ్ గ్రామస్తులు ఊరువిడిచి వనవాసం వెళ్లారు. వానాలు కురువకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వాన దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. తమ గ్రామం బాగుండాలని ఆకాంక్షిస్తూ పిల్లా పాపలతో ఊరు విడిచి ఆదివారం వనవాసం వెళ్లారు.

బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డికి నివాళి



గోవర్ధన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నల్లగొండ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోమలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తంగెళ్ల గోవర్ధన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం గ్రామంలో గోవర్ధన్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ మారగోని గణేష్, స్థానిక నాయకులు భీమనపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శాలిగౌరారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పీర్నాయకం అనంతరావు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దాతలు సేకరించిన క్వింటాన్నర బియ్యం, రూ. 36వేల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గిరిగాని రవీందర్, వడ్లకొండ సైదులు, అంబటి యాకేష్, భాను, పీర్నాయకం కృష్ణమూర్తి, వెంకటేష్, సైదులు, హనుమంత్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

కట్టంగూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి అన్నారు. కట్టంగూరు పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే యూరియా, డీఏపీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రె కార్యక్రమంలో ఏవో గిరి ప్రసాద్, పీఏసీఎస్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ సీఈవో బండ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండు పరమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎస్.లింగోటంలో ఘనంగా సవార్ల ఊరేగింపు

కనగల్, జూలై 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌లింగోటంలో ఆదివారం పీర్ల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని పీర్ల కొట్టం వద్ద ముతావలీల ఆధ్వర్యంలో మొదటగా హల్వా వేడుక చేపట్టారు. పలువురు భక్తులు అగ్నిగుండం నిప్పుల మీదుగా నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఆదివారం ఉదయం ఇమామ్‌ఖాసీం సవారును డప్పుచప్పుళ్లతో గ్రామంలో ఇంటింటికి తిప్పుతూ ఊరేగించారు. గ్రామస్థులు సవారుకు నీళ్లారాబోసి దట్టీలు కట్టారు. అనంతరం సవారును బావినీటిలో నిమజ్జనం చేసి పీర్ల పండుగను ము గించారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గంఎన్నిక



నార్కట్‌పల్లి లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నార్కట్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లారీ యజమానుల సంఘం నార్కట్‌పల్లి కారవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ యుగేందర్‌రెడ్డి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సామ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోలగోని నరేశ్, సహాయ కార్యదర్శిగా ఏకూరి చిరంజీవి, కోశాధికారిగా పైళ్ల నర్సిరెడ్డితో కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో అసోసియేషన్‌ను ముందుకు తీసుకెళ్తానని, లారీ యజమానుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్ నిషేధించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గట్టుప్పల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్ నిషే, ధించాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని రూపొందించిన కరప్రతాన్ని మండలకేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవైఎఫ్ఐ యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా ఉందన్నారు. యువతను చైత న్యం చేయడానికి నకిరేకల్‌లోజూలై 24న ప్రారంభమై ఆగస్టు 02న మిర్యాలగూడ వరకు జరిగే సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు టేకుమట్ల కృష్ణ, ఉపాధ్యక్షుడు రావుల వెంకన్న, పరసగోని నితిన్, కర్నాటి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ముస్కు బుచ్చిరెడ్డి ,కర్నాటి వెంకటేశం, కర్నాటి యాదయ్య చంద్రయ్య, జెల్లా శ్రీను పాల్గొన్నారు.

ఏపీలింగోటం పెద్దచెర్వు ఆక్రమణల తొలగింపు



చెర్వు మధ్యలో వేసిన బ్రిడ్జి మట్టిరోడ్డు తొలగింపుపై సూచనలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీలింగోటం, ఎం.ఎడవల్లి రెవెన్యూ గ్రామాల శివార్లలో ప్రభుత్వ భూమి, చెర్వు శిఖం ఆక్రమించి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వేసిన మట్టి రోడ్డును, చెర్వులో వేసిన బ్రిడి తొలగించే పనులను సంబంధిత అధికారులు ఆదివారం చేపట్టారు. స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ సంస్థ పై రెండు గ్రామాల పరిధిలోని సర్వే నెంబర్ 122, 323లకు వచ్చే ప్రభుత్వ భూములను తమ వెంచరులో కలుపుకుని ప్లాట్లను చేసి విక్రయించింది. ఎఫ్‌టీఎల్‌లను కూడా ఆక్రమించి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ఏపీలింగోటం పెద్దచెర్వు మధ్యలో ఏకంగా రోడ్డు బ్రిడ్జిని నిర్మించి ఎగువన ఉన్న వెంచరులోకి వెళ్లడానికి మట్టి రోడ్డుతో నిర్మాణం కూడా చేపట్టింది. అయితే అప్పట్లోనే ఈ వెంచరుపై తీవ్ర ఆరోపణలు రావడంతో నీటి పారుదల శాఖ అధికారులు కూడా మొక్కుబడి సర్వే చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ వెంచరులో దాదాపు 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ, చెర్వు శిఖం భూమి ఆక్రమణలకు గురైందన్న విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వ పెద్దల దృష్టికి కొందరు తీసుకెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 18న ఏపీ లింగోటం పెద్ద చెర్వును ఐబీ, రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. పూర్తిస్థాయి సర్వే చేసి ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆదివారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల రోడ్డు బ్రిడ్జీని, మట్టి రోడ్డును తొలగించే పనులను పోలీసుల సాయంతో చేపట్టారు. అలాగే శిఖంలో పాతిన రాతి కడీలను తొలగించారు. నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఐబీ డీఈఈ పిచ్చయ్య, ఆర్ఐ తరుణ్, సర్వేయర్ బీ.శ్రీనివాస్, ఐబీ ఏఈఈలు రమాదేవి, మాధవి ప్రియ, నాగరాజు, నవీన్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



వెలిమినేడులో ఇంటి నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

● *నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం*

చిట్యాలరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి, ఆరెగూడెం, చిన్నకాపర్తి, బోయగుబ్బ, మొగిలిదోరి, పిట్టంపల్లి, వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమంటే ప్రజా ప్రభుత్వమని, పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని వారు ఆందోళన చెందవద్దని రెండో విడతలో మంజూరయ్యేలా చూస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీని పరిధిని పెంచామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా అవకాశం కల్పించిందన్నారు. గతంలో దివంగత ఇందిరాగాంధీ, ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టిచ్చారని ఇప్పుడేమో సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి కట్టిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని ప్రజాప్రభుత్వంలో గ్రామాలన్నింటిని మరితంగా అభివృద్ధి చేసేందుకు ప్రజలు ఆశీర్వచనాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతుసంఘం నాయకులు, అధధికారులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గట్టుప్పల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలో నిర్మిస్తున్న శివభక్త మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణ పనులను మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఇడం భాస్కర్, దేవస్థాన అధ్యక్షుడు అవ్వారి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు నామని జగన్నాథం, పుర ఐమతం విద్యాసాగర్, జెల్ల షణ్ముఖ, విడం వెంకటేశం, పున్న కిషోర్, జెల్ల స హార్యకాంతం, నామని వెంకటేశం, గడ్డం కృష్ణయ్య, సామల యాదయ్య, చేరుపల్లి ఆంజనేయులు, చిలుకురి అంజయ్య, నారని జగన్, పున్న ఆనంద్, రాపోలు మార్కండేయ్య, జెల్ల శ్రీనివాస్ మారయ్య పాల్గొన్నారు.

పద్మశాలి వైకుంఠధామం ప్రారంభం

మండల కేంద్రంలో పద్మశాలిలకు ప్రత్యేక గదులతో నిర్మించిన వైకుంఠధామాన్ని ఆదివారం మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలి అధ్యక్షుడు నామని జగన్నాథం, తిరందాసు రాములు, ఇడం వెంకటేశం, నామని బుచ్చయ్య, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిషోర్, కర్నాటి శ్రీనివాస్, ,చేరుపల్లి సతయ్య, సామల యాదయ్య, చేరుపల్లి ఆంజనేయులు, జెల్ల మరయ్య, పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణేదీ?

(5వ పేజీ తరువాయి)

కేఆర్ఎంబీకి అందజేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా నిధులు కేటాయించగానే మొదటగా ఒక గేటు దిగువన స్పిల్‌వేకు మరమ్మతులు చేసి ఈ ఏడాది వరదలు తట్టుకుంటే మిగిలిన అన్ని గేట్ల దిగువ భాగాన స్పిల్‌వే అదే పరిజ్ఞానంతో మరమ్మతులు చేపడతామన్నారు. కానీ నేటివరకు ఆ దిశగా ఎలాంటి అడుగులు పడలేదు. ప్రస్తుతం ఎగువ నుంచి సాగర్‌కు వరదలు మొదలవడంతో ఈ ఏడాది స్పిల్‌వే మరమ్మతులు లేనట్లే అని అర్థమవుతోంది.

క్రస్ట్ గేట్లకు సర్వీసింగ్ పూర్తి

సాగర్ ప్రాజెక్టుకు వరదలొచ్చే సమయంలో ఏటా జూన్‌లో క్రస్ట్ గేట్లకు రబ్బరు సీళ్లను సరిచేయడం, గేట్లను ఎత్తడానికి ఉపయోగించే రోప్‌లకు గ్రీసింగ్ చేయడం, మోటార్లకు సర్వీసింగ్ చేయడం వంటి పనులు చేపడ్తారు. ఈ పనులను ఈ ఏడాది జూన్ 20వ తేదీన పూర్తయ్యాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అంతే కాకుండా ఎడమ, కుడి ఎర్త్‌డ్యాం (కట్టలకు) పై జంగిల్ కటింగ్ , విద్యుత్ సరఫరా వంటి పనులు కూడా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు గానూ ఏటా రూ.10లక్షలు ఖర్చవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టుపై పట్టింపేదీ

నల్లగొండ జిల్లాలో ఆరువేల ఎకరాలకు సాగునీరు, మరో 50 గ్రామాల్లో భూగర్భజలాల పెంపుదలకు దోహదపడే శాలిగౌరారం ప్రాజెక్టు నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. ఈ ప్రాజెక్టు షట్టర్లు శిథిలమై దశాబ్దంపైగా గడిచిపోయినా వాటిని మార్చే ప్రతిపాదనలకు మోక్షం కలగడంలేదు. ఈ ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ తూముకు నాలుగు షట్టర్లుండగా, ఒకటి మాత్రమే పనిచేస్తుంది. మిగిలిన మూడు తుప్పపట్టి శిథిలమవడంతో నీరంతా వృథాగా వెళ్లిపోతుంది.

ప్రధాన ఎడమ కాల్వ తూముకున్న రెండు షట్టర్లలో ఒకటి శిథిలమైతే, మరోటి పనిచేస్తుంటే, ఇక్కడ సైతం నీటి వృథా నిరంతరాయంగా సాగుతోంది. ఈ ప్రాజెక్టు షట్టర్ల మరమ్మతులకు నిధులు కేటాయించడంలేదు. ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారి కూడా లేరు. నాలుగు నెలల క్రితం ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మం దుల సామేల్ ఈ ప్రాజెక్టుని సందర్శించి షట్టర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తామని ప్రకటించినా, అమలుకు నోచలేదు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టును సూర్యాపేట జిల్లా ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో చేర్చితే, భౌగోళికంగా నల్లగొండ జిల్లాలో ఉందని, ఈ సమస్య కూడా ప్రాజెక్టుపై అధికారుల నిర్లక్ష్యానికి కారణంగా స్థానిక రైతాంగం వాపోతోంది.

వర్షపాతం లోటు మెట్టకు చేటు

(5వ పేజీ తరువాయి)

34.7మి.మీలు, చింతపల్లిలో 29.8మిమీల వర్షపాతం అధికంగా కురిసింది. మూడు మండలాల్లో మినహా జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లో అరకొర వానలే పడ్డాయి. లోటు వర్షపాతంతో మెట్ట పంటలపై తీవ్ర ప్రభావం చూపించనుంది. వాస్తవానికి జూన్‌లో మృగశిర కార్తె నాటికి పెద్దఎత్తున విత్తనాలు వేయాల్సి ఉండే. వర్షాలు లేక పోవడంతో జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలకు జిల్లాలో 5లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. మళ్లీ వర్షాలు కనుమరుగు కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. సమృద్ధిగా వానలు లేక భూగర్భజలాలు అడుగంటిపోగా రెండు రోజులుగా కురిసిన అరకొర వానలు వాతావరణం కొంత చల్లబడటానికి ఉపయోగపడినప్పటికీ మళ్లీ తిరిగి యథావిధిగా వాతావరణం వేడివల్ల పత్తి చేలపై ప్రభావం చూపిస్తుం ది. ఈపాటికే పూత కాత దశలో ఉండాల్సిన పత్తిచేలు మొలకల స్థానంలోనే ఎదుగుపొదుగు లేకుండా ఉండిపోయాయి. కొన్నిచోట్ల కొంతమేరకు పత్తి చేలు ఎదిగినప్పటికి వర్షం రాకపోవడంతో రైతాంగం నష్టపోయే ప్రమాదం ఉంది. ఆలస్యంగా వేసిన విత్తనాలకు తోడు వర్షాలు సమృద్ధిగా లేక పంటల దిగుబడులపై ప్రభావం చూపించనుంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు వస్తాయా? రావా? అన్న సందేహం కూడా వ్యక్తమవుతుంది.

మునిసిపల్ ఎన్నికలెప్పుడో?

(5వ పేజీ తరువాయి)

మునిసిపాలిటీలను అటుంచితే పాత మునిసిపాలిటీలైన నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. ఆయా పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతోపాటే ఆవాసాల సంఖ్య గణనీయంగా నమోదవుతోంది. జనాభా, విలీనమైన గ్రామాలు, ఇళ్ల సంఖ్యకనుగుణంగా 2019లో పునర్విభజన జరగ్గా, జిల్లావ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీల్లో వార్డులు పెరిగాయి. అయితే వార్డులవారీగా ఓటర్ల సంఖ్య పెరిగింది. వార్డులు వెయ్యి నుంచి 1200 ఉండాల్సి ఉండగా, ఒక్కో వార్డులో 1500, రెండువేల ఓట్లు నమోదవుతున్న తరుణంలో వార్డుల పునర్విభజన చేపట్టాలని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

సకాలంలో ఎన్నికలు నిర్వహించలేదు

పాలన ఏ పార్టీదైనా స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో ఎన్నడూ నిర్వహించలేదు. స్వార్థ ప్రయోజనాలకోసం ఎన్నికలు వాయిదా వేయడం పరిపాటిగా మారింది. జిల్లావ్యాప్తంగా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పాలన కుంటుపడగా, సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారులకు పరిస్థితిని వివరిస్తూనే ఉన్నాం. వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలి.

- డబ్బీకార్ మల్లేష్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, మిర్యాలగూడ

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	566.70 (248.2946)	67.556	4058
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	866.89	531.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.573 (16.8784)	నిల్	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



నకిలీలపై నిఘా

- వరంగల్ ఆర్‌జేడీ నేతృత్వంలో విచారణకు కమిటీ !
- ఇంటర్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌లో తప్పుడు పత్రాల పరిశీలనకు ఆదేశం
- ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై ఫిర్యాదులు

నకిలీ అధ్యాపకులపై ప్రభుత్వం విచారణ చేపట్టనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తూ 2025 మేలో రెగ్యులరైజ్ అయిన వారి విద్యార్హతలు, పూర్వాపరాలు, వ్యక్తిత్వం, నియామక ఉత్తర్వుల్లోని నిబంధనల పరిశీలనకు ఉపక్రమించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ ఎట్టకేలకు ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

క్రమబద్ధీకరణ పొందిన లెక్చరర్లలో పలువురు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారనే ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో తాజాగా బోర్డు రెగ్యులర్ అయిన అధ్యాపకుల సర్టిఫికెట్ల పరిశీలనకు కమిటీని ఏర్పాటుచేసింది. నకిలీ సర్టిఫికెట్లపై సమస్త ఆధారాలతో ఉన్నతాధికారులకు, సీబీసీఐడీకి సైతం ఫిర్యాదులు వెళ్లిన విషయం తెలిసిందే. పలుమార్లు ఇంటర్ బోర్డ్ అధికారులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినా అమ్యామ్యాలతో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో...

- మిగతా 7వ పేజీలో...

ప్రాజెక్టుల నిర్వహణేదీ?

కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. వానాకాలం సీజన్‌కు ముందే నిర్వహణాపరమైన మరమ్మతులు చేయాల్సి ఉండగా, వాటిని పట్టించుకోకుండా ప్రమాదాలు ముంచు కొచ్చేంతవరకూ వేచి చూస్తున్నారు. దీంతో ప్రాజెక్టుల పటిష్ఠత ప్రశ్నార్థకంగా మారుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)/నెట్‌వర్క్)



నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే పై పడిన గుంతలు

- వానాకాలం ముందస్తు పనుల నిర్వహణలో లోపాలు
- అరకొర పనులతో మమ అనిపిస్తున్న వైనం
- స్పిల్‌వే మరమ్మతులపై ముందుకుపడని ప్రతిపాదనలు
- మూసీ, డిండి, శాలిగౌరారం ప్రాజెక్టుల నిర్వహణా అంతంతే

ప్రతి వేసవిలో ప్రాజెక్టుల నిర్వహణ నిమిత్తం గేట్ల మరమ్మతులు, కట్టల బలోపేతం, స్పిల్‌వేలకు అవసరమైన మరమ్మతులు, డ్యామ్‌లపై లైటింగ్‌ఏర్పాట్లు, జంగల్ కటింగ్ వంటి పనులను చేపట్టాల్సిన ఉంది. కొన్ని పనులు తూతూమంత్రంగా చేసి వదిలేస్తుండగా, మరికొన్ని పనులు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేవంటూ చేయకుండా వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలకమైన నాగార్జునసాగర్, డిండి ప్రాజెక్టులతోపాటు, శాలిగౌరారం ప్రాజెక్టుపైనా ఈ అశ్రద్ధ కనిపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాజెక్టుల కనీస నిర్వహణ పనులు చేపట్టాలనే సూచనలు రైతాంగం నుంచి వస్తున్నాయి.

సాగర్ స్పిల్‌వే మరమ్మతులు ఈ ఏడాదికి లేనట్లే

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా విరాజిల్లుతూ రెండు రాష్ట్రాల్లో 22లక్షల ఎకరాలకు సాగు నీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ స్పిల్ వే మరమ్మతులు ఈ ఏడాదికూడా చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి స్పిల్‌వేకు ప్రాజెక్టు నిర్మాణ సమయం (1967లో పూర్తయింది) నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు మరమ్మతులు చేశారు. మొదట 1987లో స్పిల్‌వేకు మరమ్మతులు చేశారు. ఆ తర్వాత 2009లో వచ్చిన భారీ వరదలకు స్పిల్‌వేపై భారీ గుంతలు పడటంతో 2011లో రూ.40 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత 2014లో తిరిగి రూ.16 కోట్ల వ్యయంతో స్పిల్‌వే మరమ్మతులు చేపట్టారు. తాజాగా 2023లో రూ.20 కోట్ల వ్యయంతో స్పిల్‌వే మరమ్మతులు చేశారు. కానీ 2024లో వచ్చిన చిన్నపాటి వరదకే స్పిల్‌వేపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సాగర్ స్పిల్‌వేకు ఆధునిక పరిజ్ఞానంతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని అలాగే స్పిల్‌వే వద్ద అటు ఇటు కదిలే క్రేన్‌ను ఏర్పాటు చేస్తే స్పిల్‌వే మరమ్మతులు చేపట్టడం సులభం అవుతుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఈ ఏడాది జనవరి నెలలో హైదరాబాద్‌లో జలసౌధలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపారు. కానీ నేటివరకు ఆ పనులు ఏవి మొదలు కాలేదు. తాజాగా గత నెలలో ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధులతో కలిసి సాగర్ స్పిల్‌వేను పరిశీలించి వెళ్లింది. స్పిల్‌వేపై పడిన గుంతలను ఆధునిక పరిజ్ఞానంతో పూడ్చివేయాలని, ఇందుకు సంబంధించిన నివేదికలు ఈఎన్‌సీకి...

- మిగతా 8వ పేజీలో...

డిండి ప్రాజెక్టు నిర్వహణపై చిన్నచూపు

నల్లగొండ జిల్లాలో నిజాం హయాంలో నిర్మించిన ప్రాచీన ప్రాజెక్టు డిండి ప్రాజెక్టు. 2.4టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్వహణపై ఇరిగేషన్‌శాఖ శీతకన్నేసింది. ఈ ప్రాజెక్ట్ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు షట్టర్లుండగా, మధ్య షటర్‌నుంచి నిరంతరాయంగా నీరు లీకేజీ అవుతుంది. షటర్ గ్రూ సరిగా కూర్చోకపోవడంతో రబ్బరు సీలు నుంచి నీటి లీకేజీ అవుతుంది. నీటి లీకేజీని అదుపు చేసేందుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. స్పిల్‌వే వియర్ ముందు బాగంలో ఉన్న కంపచెట్లను తొలగించలేదు. దీంతో ప్రాజెక్టు ఓవర్ ఫ్లో అయ్యే సమయంలో నీరు సాఫీగా వెళ్లడం లేదు. కనీస నిర్వహణ సైతం ఇరిగేషన్‌శాఖ పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు పటిష్ఠత దెబ్బతినడంతోపాటు నీటి లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి.



ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సాగునీటి సమస్య పరిష్కరించాలి

కేతేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటిని అందించే డి49, డి50కాల్వలకు సరైన రీతిలో సాగు నీటిని అందించేందుకు ప్రధాన కాల్వకు గేట్లు అమర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇనుపాముల, గుడివాడ, కొర్లపహాడ్, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములకు, చెరువులు, కుంటలకు నీటిని అందించే డి49, డి50 కాల్వలను పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కాల్వలోని షట్టర్‌కు గేట్లు లేకపోవడంతో డి49, డి50కాల్వలకు తగినంత నీరు రావడంలేదన్నారు. దీంతో ప్రతి ఏటా మండలంలోని ఆయకట్టుతో పాటు చెరువులు, కుంటలు నిండని పరిస్థితి నెలకుంటుందని అన్నారు. అధికారులు స్పందించి ప్రధాన కాల్వలకు గేట్లు అమర్చి డి49, డి50 కాల్వలకు నిర్ణీత మోతాదులో నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ. అనితాగౌడ్, వి. నాగయ్య, పద్మ, పి. రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికలెప్పుడో?

- పట్టణాల్లో మొదలైన చర్చ
- వార్డుల విభజన లేనట్లేనా..



స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైన నేపథ్యంలో మునిసిపల్ పోరుపై పట్టణాల్లో చర్చ మొదలైంది. ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలోని 128 మునిసిపాలిటీల్లో పాలక మండళ్ల గడువు ముగిసింది. ఆయా మునిసిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే పాలక వర్గ పాలన ముగిసి ఆరు నెలలు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని, ఎప్పటిలోగా నిర్వహిస్తారో? చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

పాలకవర్గం లేకపోవడంతో పట్టణాల్లో పాలన కుంటుపడిందని చెప్పకతప్పదు. అభివృద్ధి పనులు జరగకపోవడం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో పౌరసేవల్లో జాప్యం నెలకొంటోంది. మునిసిపాలిటీల్లో పారిశుధ్య వ్యవస్థ మరీ అధ్వానంగా మారగా, 100 రోజుల యాక్షన్ ప్లాన్ నామమాత్రంగా సాగుతుందనే ఆరోపణలున్నాయి.

వార్డుల విభజన ఉంటుందా..?

పట్టణీకరణ జరుగుతుండటంతో మునిసిపాలిటీల్లో వార్డుల విభజన ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జిల్లాలో 8, యాదాద్రి భువనగిరి జిల్లాలో 6, సూర్యాపేట జిల్లాలో 5తో కలిపి 19 మునిసిపాలిటీలుండగా వార్డుల సంఖ్య 416గా ఉంది. అయితే నూతనంగా ఏర్పడిన..

- మిగతా 8వ పేజీలో...

ఎలాంటి సమాచారం అందలేదు



పట్టణాల్లో రోజురోజుకు జనాభా పెరుగుతున్న మాట వాస్తవమే. అయితే వార్డుల పునర్విభజన, పట్టణాల విస్తరణ అనేది అతిపెద్ద అంశం. ఆయా అంశాలకు సంబంధించి ప్రభుత్వానిదే తుది నిర్ణయం. మునిసిపల్ ఎన్నిక నిర్వహణ, వార్డుల విభజన తదితర అంశాలపై మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎలాంటి సమాచారం అందలేదు.

- గుణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

ఈ నెల 20 వరకు వర్షపాతం లోటు ఉన్న మండలాలు ఇవే..

మండలం	వర్షపాతంలోటు (మి.మీలలో)
చిట్యాల	13.6
నార్కట్‌పల్లి	32.4
కట్టంగూరు	42.4
శాలిగౌరారం	37.1
నకిరేకల్	20.3
కేతేపల్లి	48.3
తిప్పర్తి	38.1
నల్లగొండ	45.1
కనగల్	34.4
అనుముల	51.6
నిడమనూర్	45.6
త్రిపురారం	39.0
మాడ్గులపల్లి	49.5
వేములపల్లి	49.5
మిర్యాలగూడ	45.2
దామరచర్ల	23.3
అడవిదేవులపల్లి	42.5
తిరుమలగిరిసాగర్	35.0
పెద్దవూర	32.9
గుర్రంపోడు	53.1
పీఏపల్లి	21.3
నేరడుగొమ్ము	22.2
కొండమల్లేపల్లి	11.8
దేవరకొండ	10.5
చందంపేట	8.6
గుడిపల్లి	31.0
మునుగోడు	2.3
చండూరు	34.4
గట్టుప్పల్	16.2
నాంపల్లి	57.6



వర్షపాతం లోటు.. మెట్టకు చేటు

- వానాకాలం ప్రారంభమై 50 రోజులు గడిచినా సమృద్ధిగా కురవని వానలు
- అక్కడక్కడ చిరుజల్లుల నుంచి మోస్తరు వానలతోనే సరి
- మెట్ట పంటలపై తీవ్ర ప్రభావం

నల్లగొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై 50రోజులు గడుస్తున్నా జిల్లాలో సమృద్ధిగా వర్షా లు కురవకపోవడంతో రైతాంగం తీవ్రఆందోళన వ్యక్తం చేస్తుంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వర్షాలకోసం ఎదురు చూస్తున్నారు. అక్కడక్కడ చిరుజల్లుల నుంచి మోస్తరు వాన లే కురుస్తున్నాయి తప్ప భారీ వర్షాలు రావడంలేదు. జూన్, జూలైలో పెద్దఎత్తున వర్షాలు కురుస్తాయని భావించినప్పటి కీ ఆశించినస్థాయిలో వానలు పడటంలేదు. వరుణుడు దాగు డుమూతలు ఆడటం తప్ప వానాకాలంలో.. ఎండాకాలం మాదిరి పరిస్థితులు తారుమారయ్యాయి. ఈ ఏడాది రుతుపవనాలు నిర్దిష్ట సమయం కంటే ముందే.. అంటే మే నెలాఖరులోనే రాష్ట్రంలోకి ప్రవేశించినా, ఆ తర్వాత రానురాను జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు పడటంలేదు. జూలైలో కూడా రుతుపవనాల్లో ఎలాంటి కదలికలు లేకపోవడంతో చినుకు కురువని పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు కురవకపోవడంతో భూమిలో తేమశాతం లేక వాతావరణ చల్లబడటంలేదు. నల్లగొండ జిల్లాలోని 33 మండలాలను పరిశీలిస్తే దేవరకొండ డివిజన్‌లో -50.7మిమీల వర్షపాతం లోటు ఉంది. అదేవిధంగా నల్లగొండ డివిజన్‌లో -35.1మి.మీల లోటు మిర్యాలగూడ డివిజన్‌లో -41.7మి.మీల వర్షపాతం లోటు, చండూరు డివిజన్‌లో -11.3మి.మీల వర్షపాతం లోటు ఉంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా సగటున వర్షపాతం లోటును పరిశీలిస్తే ఆదివారం నాటికి -26.4శాతం వర్షపాతం లోటు రికార్డు అయింది. జిల్లాలో ఎక్కడా వర్షపాతం చెప్పదగ్గట్లుగా నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలంలో సైతం ఎండకాలం మాదిరిగానే పరిస్థితులున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగడం ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉన్నట్లు ఉక్కపోత ఉంటుంది.

వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే..

సమృద్ధిగా వర్షాలు కురిస్తే తప్ప వాతావరణంలో మార్పులు కనిపించే అవకాశాలు కానరావడం లేదు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన ఇప్పటికి సాధారణ వర్షాపాతాలు నమోదు కాలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. అప్పుడప్పుడు మబ్బులు కనిపించడం తప్ప వర్షాలు మాత్రం కురవడంలేదు. జిల్లాలో ఏదో ఒక చోట, ఎప్పుడో ఒక రోజు కొద్దిసేపు స్వల్పంగా వర్షం కురవడం మినహా వ్యవసాయానికి అనుకూలంగా వర్షం పడటంలేదు. మే నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసినా రైతులు అవి మొలకెత్తకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. మేనెలలో కురిసిన అడదడపా కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకొని సిద్ధంగా ఉన్నా రైతులకు నైరుతి రుతుపవనాలు ఊరించి ఉసురుమన్పించాయి. అయితే జూన్ నెలలో వర్షాలు పడకపోవడంతో జూలై మొదటి వారంలో అడపదడపా కురిసిన వర్షాలతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. ప్రస్తుతం అంటే గత రెండు రోజులుగా అడపదడపా కురుస్తున్న వర్షాలు ఆశాజనకం లేవని చెప్పవచ్చు.

మూడు మండలాల్లో మినహా అంతటా అరకొర వానలే...

జిల్లాలోని 33 మండలాలు పరిశీలిస్తే చండూరు డివిజన్ లోని మర్రిగూడలో 66.3మి.మీలు, గుండ్లపల్లిలో...

- మిగతా 8వ పేజీలో...

పుష్పాంబరి దేవిగా ఎల్లమ్మ

కనగల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆషాడ మాసం చివరి ఆదివారం అమ్మవారు పుష్పాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు నిర్వహించారు. చీర సారె ఒడిబియ్యం బోననైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అర్చకులు అమ్మవారికి విశేషంగా అలంకరించి హారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

పండుగలు మన సంస్కృతికి ప్రతీకలు

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



సాగర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నాగార్జునసాగర్, జూలై20(ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీ ముత్యాలమ్మ, ఫైలాన్ కాలనీ పోచమ్మ ఆలయాల్లో ఆదివారం ని ర్వహించిన బోనాల పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ప్రసాద్,రాంబాబు, నాగరాజు, రంగారెడ్డి, భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాలు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో కొలువైన మహిషాసురమర్థిని, అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు మహిళలకు ఆదివారం బోనాలు సమర్పించారు. మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవార్లకు బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకొని తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ ప్రధాన అర్చకుడు వెల్లటూరి రామ్మోహన్‌శర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిట్యాలలో 7.5సెంటీమీటర్ల వర్షం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కురియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా, లైట్ల వెలుతురులో ప్రయాణించాయి. చిట్యాలలో 7.5, నార్కట్‌పల్లిలో 6, కట్టంగూరులో 5.7, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 5.8, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది.



చిట్యాలలో కురుస్తున్న వాన

7

రైతులకు ఉచితంగా తుమ్మ మొక్కల పంపిణీ

మిర్యాలగూడ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి):రైతులకు ఉచితంగా తుమ్మ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు పర్యావరణ ప్రేమికుడు రావుల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నందిపాడుకాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు.విత్తనాలు సేకరించి స్వయంగా తుమ్మ మొక్కలను పెంచుతున్నానని, మొక్కల కోసం 7993 439127 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఎన్నికలకు యువత సిద్ధం కావాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు శివ, రాజునాయక్, పవన్, నాగరాజు, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు నుంచి సర్కారు బడికి వలసలు

» ఫలితమిచ్చిన బడిబాట » ఈ ఏడాది కేశంనేనిపల్లి పాఠశాలలో 63 మంది విద్యార్థుల చేరిక



గుడిపల్లి మండలం కేశంనేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన బడిబాట మండలంలో సత్ఫలితాలనిస్తోంది. మండలంలోని కేశంనేనిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతుల తో విద్యా బోధన చేస్తూ, విద్యార్థులతో రీడింగ్ యాక్టివిటీస్ చేపి స్తూ వీడియోలను గ్రామ వాట్సప్ గ్రూప్‌లో షేరు చేస్తున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి పాఠశాలల్లో సౌకర్యాలను వివరించడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు చేరారు.

- (ఆంధ్రజ్యోతి - గుడిపల్లి)

మండలంలోని కేశంనేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన సాగేది. కానీ గ్రామంలోని పిల్లలంతా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడంతో ఆ పాఠశాలలో 06 విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బడి మూసివేసే స్థితికి వచ్చింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు డి. శ్రీనివాస్‌రెడ్డి తల్లిదండ్రులను ఒప్పించి గతేడాది చివరిలో 10 మంది విద్యార్థులను చేర్పించగా ,ఈ ఏడాది తోటి ఉపాధ్యాయుడు వెంకటరెడ్డితో కలిసి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి 63 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. దీంతో ప్రస్తుతం 79 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

పూర్వ వైభవం దిశగా..

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. దాతల సాయంతో బడిలో సౌకర్యాలు మెరుగుపరిచారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందో చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులు,తల్లిదండ్రులతో చర్చించి నివృత్తి చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సహకారం అందిస్తాం..



గుడిపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించాం. పాఠశాల బలోపేతానికి గ్రామస్తులందరి సహకారంతో ముందుకువెళ్తాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇద్దరి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై రప్పించాం. పాఠశాల శిధిలావస్థకు చేరుకోవడంతో సాయంతో మరమ్మతు చేయిస్తున్నాం. పాఠశాల అబివృద్ధికి సహాయసహకారాలు అందిస్తాం

- సముద్రాల శ్రీనయ్య, ఎంఈవో, గుడిపల్లి

నాణ్యమైన బోధన అందిస్తాం



మూతబడే స్థాయికి వచ్చిన పాఠశాలను దాతలు, గ్రామస్థుల సాయంతో పూర్వ వైభవం తీసుకొచ్చాం. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాం. గ్రామస్థులు, తల్లిదండ్రులు తమపై నమ్మకంతో 63 మంది ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా విద్యార్థులను సర్కారు బడికి పంపించారు. మొత్తం 79 మంది విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన బోధన అందిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం కేశంనేనిపల్లి

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



పోరెడ్డిగూడెంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడ్గులపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ అన్నారు. మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, కల్వలపాలెం, బొమ్మకల్, భీమనపల్లి, తోపుచర్ల, గం ద్రవానిగూడెం, ఇసుకబావిగూడెం, కుక్కడం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా, రుణమాఫీ, భూభారతి, పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు పేదలకు రేషన్‌కార్డులను ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు,. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నానరు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జూలకంటి సైదిరెడ్డి, అందెం యాదయ్య, భూపతి ఉషయ్య, మోహన్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, చింతకాయల సతీష్, మంగా యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

లిఫ్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలి

అడవిదేవులపల్లి : మండలంలో నిర్మిస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో అన్ని సీజన్లలో పుష్కలంగా నీరు ఉండి మండలంలో సుమారు 12,610 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఆయన వెంట అధికారులు, రైతులు ఉన్నారు.

శాకంబరి దేవిగా లక్ష్మీతిరుపతాంబ



శాకంబరిదేవి అలంకారంలో గోపయ్య సమేత లక్ష్మీతిరుపతాంబ

వేములపల్లి, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవి గూడెం గ్రామంలో కొలువైన గోపయ్య సమేత లక్ష్మీతిరుపతాంబ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా వేదపండితులు సూర్య కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లను వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి బోనాలు, నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

లైసెన్స్‌లేకుండా వాహనాలు నడపొద్దు

దేవరకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని దేవరకొండ సీఐ నర్సింహులు హెచ్చరించారు.దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో ఆదివారం వాహనాల తనిఖీలో పాల్గొని మాట్లాడారు. లైసెన్స్‌లేకుండా వాహనాలు నడిపితే చర్యలు చేపడుతామన్నారు. పట్టణం, మండలంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించి అన్ని చర్యలు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. దేవరకొండ ఎస్‌ఐ నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్

మిర్యాలగూడ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విషయ పరిజ్ఞానం పెంచుకుంటునే విద్యార్థులు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని విజేత డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ అన్నారు. హెట్రో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కోర్సులకు దీటుగా డిగ్రీ, పీజీల్లోఅందుబాటులోకి వచ్చిన లైఫ్ సైన్సెస్ కోర్సులను అందిపుచ్చుకుంటే సెటిలవ్వొచ్చన్నారు. సంస్థ హ్యూమన్ రీసోర్సస్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. ఐటీఐ నుంచి పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు రాత పరీక్ష, ముఖాముఖి నిర్వహించిన అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని పలు విభాగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, మధు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సైదులు కుటుంబానికి అండగా ఉంటాం



హాలియాలో నర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

త్రిపురారం,జూలై 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన కూరపాటి సైదులు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కుం దూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నిడమనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూరపాటి సైదులు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సైదులు మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురువయ్య, రవి కుమార్ పాల్గొన్నారు.

● హాలియా : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అలుగుల బ్రహ్మారెడ్డిని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బ్రహ్మారెడ్డి తల్లి నర్సమ్మ ఇటీవల మృతి చెందారు. అనంతరం హాలియాలోని పంగా వెంకటేశ్వర్లు మృతి చెందడంతో వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్‌కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంగోతు భగవాన్‌నాయక్, రాజాప్రసాద్, అలుగుల వెంకట్‌రెడ్డి, రామాంజిరెడ్డి, రమణారెడ్డి, కోట నాగిరెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బూడిద గోవింద్, దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య రాజకీయ రణభేరిని జయప్రదం చేయాలి



దేవరకొండలో వైశ్య రాజకీయ రణభేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దేవరకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆగస్టు 3వ తేదీన నిర్వహించే ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ అన్నారు. దేవరకొండ శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఆదివారం వైశ్య రాజకీయ రణభేరి సభ పోస్టరును సంఘం నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత పాలకులు ఆర్యవైశ్యులను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకొని పబ్బంగడుపుకున్నారని అన్నారు. ఆర్యవైశ్య జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వెంపటి వెం కటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు వాసా వెంకటేశ్వర్లు, శీల వెంకన్న, సముద్రాల సహదేవ్, దామోదర్, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయరంగాల్లో రాణించాలి

చింతపల్లి : ఆర్యవైశ్యులంతా రాజకీయాల్లో రాణించాలని సంఘం మండల అధ్యక్షుడు వందనపు అంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం రణభేరి వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ముచ్చర్ల యాదగిరి, కోర్వి గిరి సముద్రాల నగేష్, రవి, విరమళ్ల యాదయ్య, దాచేపల్లి మధు, ఉప్పల సత్యనారాయణ, వంగాల రమేష్, కోర్వి రాధకృష్ణ, కొమిరిశెట్టి వినోద్, ఆకుతోట జంగయ్య, కుంచకూరి రాము, తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి జానయ్య

పేద కుటుంబంలో పుట్టినా చదువుపై పట్టు వదలలేదు. కష్టాలు చుట్టుముట్టినా పాఠాలపై శ్రద్ధ వీడలేదు. పేదరికాన్ని జయించి చదువులో రాణించారు. కుటుంబానికి ఆసరాగా నిలబడి, ముగ్గురు తోబుట్టువులను చదువులో ఉన్నతంగా తీర్చిదిద్దాడు. కంప్యూటర్ సైన్స్‌లో పరిశోధనలు చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు హాలియాకు చెందిన బొడ్డుపల్లి జానయ్య

(ఆంధ్రజ్యోతి - హాలియా)

జానయ్య తండ్రి పశువుల ఆస్పత్రిలో అటెండర్, తల్లి గృహిణి, ఈ దంపతులకు ఐదుగురు సంతానంలో జానయ్య ఒకరు. హాలియాలో జడ్పీహెచ్‌ఎస్‌లో జానయ్య చదువుతూనే గోలి సోడాలు, పండ్లు విక్రయించడం వంటి పనులు చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా కొంత అండగా ఉంటూనే పదో తరగతిలో స్కూల్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇం టర్ ఉచితంగా చదివేందుకు హాలియాలోని సృజన జూనియర్ కళాశాల యాజమాన్యం అవకాశం కల్పించడంతో, దీని ని సద్వినియోగం చేసుకుని జానయ్య ఇంటర్‌లో మండల టాపర్‌గా నిలిచారు.

ఎన్నో కష్టనష్టాలను అధిగమించి..

ఎంసెట్‌లో 831వ ర్యాంక్ సాధించి హైదరాబాద్‌లోని ఎంవీఎస్సార్ కాలేజీలో జానయ్య చేరారు. చదువుకు ఇబ్బంది లేకుండా ట్యూషన్లు చెప్పారు. ఇంజనీరింగ్ తర్వాత సివిల్ సర్వీస్ కోసం సన్నద్ధమయ్యారు. 2006లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లి తృటిలో ఉద్యోగావకాశం కోల్పోయారు. నిరాశ చెందకుండా తాను చదివిన ఎంవీఎస్సార్ కళాశాలలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశారు. యూజీసీ నెట్, టీఎస్ సెట్ అర్హతతో ఓయూలోనే పీహెచ్‌డీ పూర్తి చేశారు. కుటుంబానికి ఆసరాగా ఉంటూనే చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లను ఓయూలో ఎంఎస్సీ చదివేలా ప్రొత్సహించారు. జానయ్య తాజాగా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ పబ్బోజు (డైరెక్టర్, ఏఈసీ అండర్ సీవోఈ) పర్యవేక్షణలో కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. జానయ్య ఇచ్చిన సలహాలతో ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. సామాజిక దృక్పథంతో జానయ్య సేవలు చేస్తూ స్థానికుల మన్ననలను అందుకుంటున్నారు.



డాక్టరేట్‌ను తీసుకుంటున్న జానయ్య (ఫైల్)

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, ప్రజాప్రతినిధులు

హాలియా, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయ డం అభినందనీయమని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రైస్‌మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. ఆదివారం ఆదిత్య ఆస్పత్రిలో హాలియా లయన్స్ క్లబ్, నల్లగొండ రివర్ నిమ్స్ హాస్పిటల్ ఆర్కే గ్యాస్ట్రో ఎంట్రాలజీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన గ్యాస్, లివర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి విచ్చేసిన సుమారు 750 మందికి అవసరమైన పరీక్షలు నిర్వహించగా అందులో 43 మందిని గుర్తించి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు వైద్య బృందం ఎంపిక చేశారు. కార్యక్రమంలో హాలియా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వీరమళ్ల శ్రీనివాస్ అదే విధంగా డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి హాలియా సీఐ దేవిరెడ్డి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సక్రునాయక్, కోశాధికారి రిమ్మలపూడి రామకృష్ణ, సభ్యులు పేలపూడి బాలకృష్ణ, నిమ్మల లక్ష్మారెడ్డి, చీదళ్ల లింగయ్య, నులక వెంకట్‌రెడ్డి, గుండా కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డుల పంపిణీ రేపు

నేరేడుగొమ్ము, జూలై 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండ సాయి శివ గార్డెన్స్‌లో మంగళవారం నూతన రేషన్‌కార్డులను పంపిణీ నిర్వహిస్తున్నట్లు నేరేడుగొమ్ము తహసీల్దార్ ఉమాదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో నూతనంగా 2,053 రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ అంజనేయులు, ఆర్‌ఐ నిఖిల్, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ దేవరకొండకు ఉత్తమ సేవా అవార్డు



సత్యనారాయణకు అవార్డును అందజేస్తున్న జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి

దేవరకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకుడు వస్కుల సత్యనారాయణ ఉత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు జిల్లా ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన క్లబ్ జిల్లా సమావేశంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ యానాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించి క్లబ్ పలు సేవ కార్యక్రమాలు చేపట్టిందని ప్రశంసించారు. గిరిజన ప్రాంతంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు లయన్స్‌క్లబ్ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, రీజినల్ చైర్మన్ గాజుల రాజేష్, మల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణేదీ?

(5వ పేజీ తరువాయి)

కేఆర్‌ఎంబీకిఅందజేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా నిధులు కేటాయించగానే మొదటగా ఒక గేటు దిగువన స్పిల్‌వేకు మరమ్మతులు చేసి ఈ ఏడాది వరదలు తట్టుకుంటే మిగిలిన అన్ని గేట్ల దిగువ భాగాన స్పిల్‌వే అదే పరిజ్ఞానంతో మరమ్మతులు చేపడతామన్నారు. కానీ నేటివరకు ఆ దిశగా ఎ లాంటి అడుగులు పడలేదు. ప్రస్తుతం ఎగువ నుంచి సాగర్‌కు వరదలు మొదలవడంతో ఈ ఏడాది స్పిల్‌వే మరమ్మతులు లేనట్లేని అర్థమవుతోంది.

క్రస్ట్ గేట్లకు సర్వీసింగ్ పూర్తి

సాగర్ ప్రాజెక్టుకు వరదలొచ్చే సమయంలో ఏటా జూన్ నెలలో క్రస్ట్ గేట్లకు రబ్బరు సీళ్లను సరిచేయడం, గేట్లను ఎత్తడానికి ఉపయోగించే రోప్‌లకు గ్రీసింగ్ చేయడం, మోటార్లకు సర్వీసింగ్ చేయడం వంటి పనులు చేపడ్తారు. ఈ పనులను ఈ ఏడాది జూన్ 20వ తేదీన పూర్తయ్యాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఎడమ, కుడి ఎర్త్ డ్యాం (కట్టలకు) పై జంగిల్ కటింగ్ , విద్యుత్ సరఫరా వంటి పనులు కూడా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు ఏటా రూ.10లక్షలు ఖర్చవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టుపై పట్టింపేదీ

జిల్లాలో 6వేల ఎకరాలకు సాగునీరు, వంద 50 గ్రామాల్లో భూగర్భజలాల పెంపుదలకు దోహదపడే శాలిగౌరారం ప్రాజెక్టు నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఈ ప్రాజెక్టు షట్టర్లు శిథిలమై దశాబ్దం పైగా గడిచిపోయినా వాటిని మార్చే ప్రతిపాదనలకు మోక్షం కలగడంలేదు. ఈ ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ తూముకు నాలుగు షట్టర్లుండగా, ఒకటి మాత్రమే పనిచేస్తుంది. మిగిలిన మూడు తుప్పుపట్టి శిథిలమవడంతో నీరంతా వృథాగా వెళ్లిపోతుంది. ఎడమ కాల్వ తూముకున్న రెండు షట్టర్లలో ఒకటి శిథిలమైతే, మరోటి పనిచేస్తుంటే, ఇక్కడ సైతం నీటి వృథా నిరంతరాయంగా సాగుతోంది. ఈ ప్రాజెక్టు షట్టర్ల మరమ్మతులకు నిధులు కేటాయించడం లేదు. 4 నెలల క్రితం ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ ప్రాజెక్టుని సందర్శించి షట్టర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తామని ప్రకటించినా, అమలుకు నోచలేదు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టును సూర్యాపేట జిల్లా ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో చేర్చితే, భౌగోళికంగా నల్లగొండ జిల్లా లో ఉందని, ఈ సమస్య కూడా ప్రాజెక్టుపై అధికారుల నిర్లక్ష్యానికి కారణంగా రైతాంగం వాపోతోంది.

వర్షపాతం లోటు మెట్టకు చేటు

(5వ పేజీ తరువాయి)

34.7మి.మీలు, చింతపల్లిలో 29.8మిమీల వర్షపాతం అధికంగా కురిసింది. మూడు మండలాల్లో మినహా జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లో అరకొర వానలే పడ్డాయి. లోటు వర్షపాతంతో మెట్ట పంటలపై తీవ్ర ప్రభావం చూపించనుంది. వాస్తవానికి జూన్‌లో మృగశిర కార్తె నాటికి పెద్దఎత్తున విత్తనాలు వేయాల్సి ఉండే. వర్షాలు లేక పోవడంతో జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలకు జిల్లాలో 5లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. మళ్లీ వర్షాలు కనుమరుగు కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. సమృద్ధిగా వానలు లేక భూగర్భజలాలు అడుగంటిపోగా రెండు రోజులుగా కురిసిన అరకొర వానలు వాతావరణం కొంత చల్లబడటానికి ఉపయోగపడినప్పటికీ మళ్లీ తిరిగి యథావిధిగా వాతావరణం వేడివల్ల పత్తి చేలపై ప్రభావం చూపిస్తుంది. ఈపాటికే పూత కాత దశలో ఉండాల్సిన పత్తిచేలు మొలకల స్థానంలోనే ఎదుగుపొదుగు లేకుండా ఉండిపోయాయి. కొన్నిచోట్ల కొంతమేరకు పత్తి చేలు ఎదిగినప్పటికి వర్షం రాకపోవడంతో రైతాంగం నష్టపోయే ప్రమాదం ఉంది. ఆలస్యంగా వేసిన విత్తనాలకు తోడు వర్షాలు సమృద్ధిగా లేక పంటల దిగుబడులపై ప్రభావం చూపించనుంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు వస్తాయా? రావా? అన్న సందేహం కూడా వ్యక్తమవుతుంది.

మునిసిపల్ ఎన్నికలెప్పుడో?

మునిసిపాలిటీలను అటుంచితే పాత మునిసిపాలిటీలైన నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. ఆయా పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతోపాటే ఆవాసాల సంఖ్య గణనీయంగా నమోదవుతోంది. జనాభా, విలీనమైన గ్రామాలు, ఇళ్ల సంఖ్యకనుగుణంగా 2019లో పునర్విభజన జరగ్గా, జిల్లావ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీల్లో వార్డులు పెరిగాయి. అయితే వార్డులవారీగా ఓటర్ల సంఖ్య పెరిగింది. వార్డులు వెయ్యి నుంచి 1200 ఉండాల్సి ఉండగా, ఒక్కో వార్డులో 1500, రెండువేల ఓట్లు నమోదవుతున్న తరుణంలో వార్డుల పునర్విభజన చేపట్టాలని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

సకాలంలో ఎన్నికలు నిర్వహించలేదు



పాలన ఏ పార్టీదైనా స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో ఎన్నడూ నిర్వహించలేదు. స్వార్థ ప్రయోజనాలకోసం ఎన్నికలు వాయిదా వేయడం పరిపాటిగా మారింది. జిల్లావ్యాప్తంగా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పాలన కుంటుపడగా, సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారులకు పరిస్థితిని వివరిస్తూనే ఉన్నాం. వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఇక పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మునిసిపాలిటీల్లో మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరముంది.

డబ్బీకార్ మల్లేష్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, మిర్యాలగూడ

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : మై బేబీ / వెంకటేశ్వర: జూనియర్ / రాఘవ: కొత్తపల్లిలో ఒకప్పుడు / విట్రోస్: తమ్ముడు, కన్నప్ప, కుబేర, దేవరకొండ : మనోజ్ : మైబేబీ మైత్రి వెంకటేశ్వర : జూనియర్